ఉష్ణోగ్రత మంగళవారం గరిష్ఠం : 30.0 కనిష్ఠం : 22.0

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



శ్రీ సత్యసాయి జిల్లా వార్తలు

బుధవారం 5 నవంబరు 2025

సత్యసాయి శత జయంతికి
200 బస్సులు
ప్రైవేటు దోపిడీకి అడ్డుకట్ట
ఆర్టీసీ ఎండీ
ద్వారకా తిరుమలరావు
(మెయిన్‌లో..)



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు

మడకశిరను సస్యశ్యామలం చేస్తాం

- కలెక్టర్ శ్యాంప్రసాద్
- ఎమ్మెల్యేతో కలిసి హంద్రీనీవా కాలువ పరిశీలన
- వక్క మార్కెట్, రెవెన్యూ డివిజన్ ఏర్పాటుపై సమీక్షలు




మణూరు వద్ద హంద్రీనీవా కాలువను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే


మడకశిర టౌన్/రూరల్/గుడిబండ/అమరాపురం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): హంద్రీనీవా కాలువ నీటితో మడకశిర నియోజకవర్గంలోని అన్ని చెరువులు నింపి ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేస్తామని కలెక్టర్ శ్యాంప్రసాద్ పేర్కొన్నారు. ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామితో కలిసి హంద్రీనీవా కాలువను మంగళవారం పరిశీలించారు. మడకశిర మండలంలో చేపడుతున్న హంద్రీనీవా కాలువ పనులపై వివరాలు తెలుసుకున్నారు. కలెక్టర్ మాట్లాడుతూ.. 13పంప్‌హౌస్‌ల ద్వారా నీటిని ఎత్తిపోసి 150కి.మీ. దూరంలో ఉన్న చెరువులను నింపుతున్నామన్నారు. తద్వారా భూగర్భ జలమట్టం పెరిగి, పంటల సాగు పెరుగుతుందన్నారు. అనంతపురం అమరాపురం వద్ద వక్క మార్కెట్ ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలించారు. మార్కెట్ ఏర్పాటుపై సమీక్షించారు. మడకశిర రెవెన్యూ ఏర్పాటుకు సంబంధించి భవనాలను పరిశీలించారు. రెవెన్యూ డివిజన్ ఏర్పాటుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. దీనిపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం హేమావతికి చేరుకుని, మానవ రూపంలో ఉన్న హెంజేరు సిద్ధేశ్వర స్వామిని దర్శించుకున్నారు. ఆలయ అభివృద్ధికి చర్యలు చేపడతామన్నారు. అనంతరం వక్క, అరటి తోటలను పరిశీలించారు. కార్యక్రమంలో నీటిపారుదల శాఖ ఎస్ఈ స్వరూప్‌కుమార్, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, ఆర్డీఓ ఆనంద్‌కుమార్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసమూర్తి, ఒక్కళిగ కార్పొరేషన్ చైర్మన్ లక్ష్మీనారాయణ, మడకశిర నగర పంచాయతీ అధ్యక్షుడు నరసింహరాజు, మైనారిటీ కార్పొరేషన్ డైరెక్టర్ భక్తర్ పాల్గొన్నారు.

వేధింపుల వడ్డింపు..!

రెచ్చిపోతున్న వడ్డీ వ్యాపారులు

- అధిక వడ్డీలకు సామాన్యుల బెంబేలు
- సమయానికి కట్టకుంటే బెదిరింపులు





● హిందూపురం టూటౌన్ పరిధిలో ఓ మహిళ అవసరాల కోసం అప్పుడప్పుడు రూ.2లక్షలదాకా వడ్డీ వ్యాపారి వద్ద రుణం తీసుకున్నారు. సమయానికి కట్టకపోవడంతో అసలు వడ్డీ కలిపి రూ.8లక్షలకు లెక్కకట్టారు. అయితే ఆమె అంత మొత్తం కట్టలేనని చెప్పడంతో ఆ వ్యాపారి ఇంటిని తాకట్టు పెట్టించుకున్నాడు. డబ్బులు కట్టకపోతే ఇంటిని రిజిస్టర్ చేయించాలని ఒత్తిడి పెంచాడు. దీంతో ఆమె పోలీసులను ఆశ్రయించారు. కొన్ని రోజులు స్తబ్ధుగా ఉన్న వడ్డీవ్యాపారి మళ్లీ ఆమెపై ఒత్తిడి తెస్తున్నాడు.

● పట్టణానికి చెందిన ఓ రాజకీయ నాయకుడు కొన్నేళ్లుగా అధిక వడ్డీకి రుణాలు ఇస్తున్నాడు. ఆ నాయకుడు హిందూపురంతోపాటు పక్క మండలంలో కూడా రుణాలు ఇస్తుంటాడు. రూ.10వేలకు రూ.వెయ్యి పట్టుకుని రోజూ వెయ్యి చొప్పున పదిరోజుల్లో తిరిగి చెల్లించాలని ఇస్తుంటాడు. అయితే ఎవరైనా చెప్పిన సమయానికి కట్టకపోతే వారిని వేధించడం లేదా బెదిరించడం చేస్తుంటాడు. అయితే ఆయన రాజకీయ నాయకుడు కావడంతో పోలీసులకు చెప్పినా న్యాయం జరుగుతుందో లేదోనని కొంతమంది ఆస్తులు తాకట్టుపెట్టి రుణాలు చెల్లిస్తున్నారు.

● పట్టణంలో వాణిజ్య ప్రాంతంగా పేరుగాంచిన ఏరియాలో వడ్డీ వ్యాపారులు అక్కడ పనిచేసే కార్మికులే టార్గెట్‌గా వారానికి నూటికి రూ.8 నుంచి రూ.15వారం వడ్డీకి ఇస్తున్నారు. ఎవరైనా కట్టకపోతే వారు పనిచేసే చోటుకి వెళ్లి బెదిరిస్తున్నారు. దీంతో అక్కడి యజమానులే చెల్లిస్తున్నారు. ఇటీవల అక్కడ పనిచేసే కార్మికులు వడ్డీ కట్టలేక స్వగ్రామానికి వెళ్లిపోయారు. అయినా ఒకరిద్దరు వడ్డీ వ్యాపారులు అక్కడికి కూడా వెళ్లి బెదిరించారు.

హిందూపురం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): పల్లె, పట్టణం అన్న తేడాలేకుండా వడ్డీ వ్యాపారులు రెచ్చిపోతున్నారు. అవసరాలే ఆసరాగా పేదల రక్తం పీలుస్తునానరు. వీరి చేతికి చిక్కిన పేదలు, సామాన్యులు, చిరుద్యోగులు అధిక వడ్డీలు కట్టలేక అల్లాడిపోతున్నారు. హిందూపురంతోపాటు జిల్లాలోని ప్రధాన పట్టణాలు మండల కేంద్రాల్లో సైతం పెద్దఎత్తున వడ్డీ వ్యాపారాలు సాగుతున్నట్లు సమాచారం. ప్రజల అవసరాన్ని బట్టి వ్యాపారులు వడ్డీ రేటు పెంచుతున్నారు. చిరువ్యాపారులు, తోపుడుబండ్ల, మగ్గంనేసేవారు ఎక్కువగా ఏరోజుకారోజు వడ్డీ చెల్లించే విధంగా రుణాలు తీసుకుంటారు. చిరు వ్యాపారులకు రూ.వెయ్యి రుణం ఇస్తే అందులో రూ.100 పట్టుకుని రూ.900ఇస్తారు. ప్రతిరోజూ వంద చొప్పున పది రోజుల్లో వెయ్యి చెల్లించాలి.

కట్టకుంటే బెదిరింపులు

ఎవరైనా అధిక వడ్డీకి రుణం తీసుకున్నవారు సమయానికి కట్టకపోతే వడ్డీ వ్యాపారులు బెదిరింపులు దారుణంగా ఉంటాయి. వీరు వడ్డీ వసూలు చేసే తీరు సినిమా సీన్లను తలపిస్తాయి. హిందూపురంలో పలువురు వడ్డీ వ్యాపారులు నియమించుకున్న మనుషులు ఎవరైనా డబ్బులు ఆలస్యం చేస్తే ఇంటివద్దకు వెళ్లి గొడవ చేస్తారు. వీరుచేసే ఆగడాలకు కొంతమంది పరువు పోతుందనే భయంతో ఉన్న వస్తువులు, ఆస్తులు తెగనమ్మి రుణం చెల్లించేస్తున్నారు.

అనుమతులు లేకుండానే...

వడ్డీ వ్యాపారం చేయాలంటే అనుమతి ఉండాలి. ముఖ్యంగా వడ్డీ వ్యాపారులు రిజిస్ట్రేషన్ చేసుకుని ఉండాలి. కానీ జిల్లాలో అలాంటివారిని వేళ్లమీద లెక్కించవచ్చు. ప్రధానంగా ఫైనాన్స్, తాకట్టు వ్యాపారాలు, వడ్డీ వ్యాపారాలు చేయాలంటే తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలి. ముఖ్యంగా వడ్డీ వ్యాపారులు రెవెన్యూ రిజిస్ట్రేషన్, పోలీస్ శాఖ ద్వారా లైసెన్స్ కలిగి ఉండాలి. లైసెన్స్ ఉన్నవారు నిబంధనలకు లోబడి వ్యాపారాలు కొనసాగించాలి. కానీ అలాంటివి మచ్చుకు కూడా కనిపించవు. ఉమ్మడి రాష్ట్రంలో 2011లో మైక్రో ఫైనాన్స్, వడ్డీ వ్యాపారుల ఆగడాల నియంత్రణ కోసం చట్టాన్ని తీసుకొచ్చారు. అయితే ఈ చట్టం పేపర్లకే పరిమితమైందన్న విమర్శలు ఉన్నాయి.

వేధిస్తే పోలీసులను ఆశ్రయించాలి



అవసరాల కోసం ఎవరైనా వడ్డీకి రుణాలు తీసుకుంటారు. వ్యాపారులు వారిని వేధించడం, బెదిరించడం చేయరాదు. అలా ఎవరైనా బెదిరిస్తే పోలీసులను ఆశ్రయించ వచ్చు. వడ్డీ వ్యాపారం చేసేవారు చట్టాలకు లోబడి లైసెన్స్ పొంది ఉండాలి. ఆ చట్టం మేరకే వడ్డీ వసూలు చేయాలి. అలాకాకుండా అధికవడ్డీకి రుణాలు ఇచ్చి బెదిరిస్తే చట్టపరంగా వారిని శిక్షిస్తాం.

- మహేష్, డీఎస్పీ, హిందూపురం

ఆటతో ఆటలు..!

క్రికెట్‌లో ప్రతిభకు పాతర

అండర్-14 జట్టులో అనర్హులు..?

- ఎంపికలో ప్రైవేటు వ్యక్తుల జోక్యం
- న్యాయం చేయాలని పేరెంట్స్ కమిటీ డిమాండ్



అండర్-14 జట్టు ఎంపికకు హాజరైన వారు

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ఆటంటే ఆడించడం..! అది మరిచిపోయి ఆటగాళ్ల జీవితాలతో ఆడుకుంటున్నారు కొందరు. ప్రతిభను ప్రోత్సహించడం మానేసి, సిఫార్సులకు తలొగ్గుతున్నారు. అనర్హులను, వయో పరిమితి దాటినవారిని జట్టుకు ఎంపిక చేస్తున్నారు. నకిలీ ధ్రువపత్రాలను యథేచ్ఛగా వాడుతున్నారు. సరైన శిక్షణ ఇవ్వకుండానే, నేరుగా వారిని బరిలో దింపుతున్నారు. ఇదీ.. జిల్లాలో క్రికెట్ పరిస్థితి..! ఈ పరిస్థితిలో మార్పు రావాలని, ప్రతిభకు చోటు దక్కాలని క్రీడాకారుల తల్లిదండ్రులు వేడుకుంటున్నారు. చాలాకాలంగా ఈ ఆరోపణలు ఉన్నా.. వారు నోరు విప్పలేదు. ప్రశ్నిస్తే.. తమ బిడ్డల భవిష్యత్తును ప్రశ్నార్థం చేస్తారన్న భయంతో మౌనంగా ఉండిపోయారు. కానీ ఇటీవల గళం విప్పుతున్నారు. ప్రక్షాళన జరగాలని డిమాండ్ చేస్తున్నారు.

ఇదేం ఎంపిక..?

జిల్లాలో క్రికెట్ క్రీడాకారుల ఎంపిక తీరుపై

(మిగతా 6లో..)

కన్నీటి వాన..!

మొంథాతో దెబ్బతిన్న పంటలు

- మళ్లీ వర్షాలతో పెను నష్టం
- నేల రాలుతున్న చీనీకాయలు, కంది పూత
- వాలిపోతున్న వరి పైర్లు
- పెట్టుబడులు కోల్పోతున్న అన్నదాతలు



పుట్లూరు వద్ద రాలిన చీనీ కాయలను చెట్టు కింద పోసిన రైతు

పుట్లూరు/ఉరవకొండ/బొమ్మనహాళ్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): వరుస వర్షాలకు చీనీ కాయలు రాలిపోతుండడంతో రైతులకు కంటిమీద కునుకు లేకుండా పోతోంది. పుట్లూరు మండలంలో పండిన కాయలు అత్యంత నాణ్యతగా, రుచిగా ఉండడంతో వ్యాపారులే తోటలకు వచ్చి, కొనుగోలు చేస్తుంటారు. వారంరోజుల క్రితం కురిసిన వర్షాలకు పరిస్థితి తారుమారైంది. కాయలు పక్వానికి రావడంతో చెట్లపైనే మాగుతున్నాయి. వర్షాల దెబ్బకు రాలిపోతున్నాయి. పెట్టుబడులైనా వస్తాయో, లేవోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. చెట్లను పట్టుకుంటే కుప్పలు తెప్పలుగా రాలిపోతున్న చీనీకాయలను ఎవరూ కొనడంలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మార్కెట్‌కు తరలిస్తే 30 కిలోల ప్యాకెట్ రూ.60 నుంచి రూ. 80 వరకు అడుగుతున్నారనీ.. ఆ డబ్బు ఆటోల బాడుగకే సరిపోతుందని రైతులు చెబుతున్నారు. దీంతో ఆ కాయలను తోటల గట్లలో పడేస్తున్నారను. మండలంలోని

(మిగతా 6వ పేజీలో....)

ట్రావెల్ బస్సు బోల్తా

- సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మృతి
- ఎనిమిది మందికి గాయాలు
- దామాజిపల్లి వద్ద ప్రమాదం



సురక్ష మృతదేహం.. క్షతగాత్రులు

చెన్నేకొత్తపల్లి మండలం దామాజిపల్లి వద్ద 44వ నంబరు జాతీయ రహదారిపై ఐచర్‌ను ఢీకొట్టి.. ప్రైవేటు ట్రావెల్ బస్సు బోల్తా పడింది. ఈ ప్రమాదంలో బెంగళూరుకు చెందిన టెకీ సురక్ష(32) మృతిచెందారు. ఆమె భర్త వినీత్, మూడేళ్ల కూతురు నిధి స్వల్పంగా గాయపడ్డారు. అమ్మ ఇక లేదన్న విషయం అర్థం చేసుకోలేని నిధి.. నాన్న గుండెలపై అమాయకంగా పడుకుని ఉండటం చూపరులను కంటతడి పెట్టించింది. ఈ ప్రమాదంలో వినోద్, ముజఫర్ ఖాన్, అసలా, వెంకట్, శిరీష గౌడ్, మాలి అనే మరో ఆరుగురు కూడా గాయపడ్డారు. బస్సు అతివేగమే ప్రమాదానికి కారణమని పోలీసులు, ప్రయాణికులు తెలిపారు.

- ఆంధ్రజ్యోతి, చెన్నేకొత్తపల్లి

(వివరాలు మెయిన్‌లో)

జ్యోతిర్లింగ దర్శనభాగ్యం



ఎగ్జిబిషన్ బయట శివలింగం

కార్తీక మాసాన్ని పురస్కరించుకుని పుట్టపర్తిలో జ్యోతిర్లింగ దర్శనభాగ్యం కల్పించారు. ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో మంగళవారం పుట్టపర్తిలోని ఆర్వీ జానకిరామయ్య కల్యాణమండపంలో జ్యోతిర్లింగ ఆలయాల నమూనాలను ఏర్పాటు చేశారు. మూడురోజుల పాటు భక్తులు దర్శించుకోవచ్చని ఓం శాంతి ప్రతినిధులు తెలిపారు. కార్తీక మాసంలో ఆయా దేవాలయాలకు వెళ్లేందుకు వీలుకాని భక్తుల కోసం ఏర్పాటు చేశామన్నారు.

-పుట్టపర్తి(ఆంధ్రజ్యోతి)



వెండి జ్యోతిర్లింగం

సోలార్ ఫ్రీ..!

- ఎస్సీ, ఎస్టీలకు వరం
- గృహాలకు ఉచితంగా సోలార్ రూఫ్‌టాప్
- 41 వేల మంది రిజిస్ట్రేషన్ (6లో..)



రీ సర్వే తెచ్చిన తంటా..!

- పరిష్కారానికి నోచుకోని సమస్యలు
- ఆందోళనలో రైతులు
- తహసీల్దార్ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణ (వివరాలు 6వ పేజీలో...)

పంచాయతీలకు కొత్తరూపు

- క్లస్టర్‌కు మంగళం .. గ్రేడ్ల కుదింపు
- జీఓ జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం(7లో)



రోడ్డు పనులు చేస్తున్న దృశ్యం

పడమటి రోడ్డు పట్టదా?

పుట్టపర్తిలో నత్తనడకన పనులు

శత జయంతి నాటికి పూర్తయ్యేనా..?

పుట్టపర్తి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): సత్యసాయి బాబా శత జయంతి వేడుకలకు ఘనంగా ఏర్పాట్లు చేస్తున్నారు. కీలకమైన ప్రశాంతి నిలయం పడమటి రోడ్డును మాత్రం నిర్లక్ష్యం చేస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. వీవీఐపీలు వచ్చే ఆ రోడ్డు పనులు నత్తనడకన సాగుతున్నాయి. శత జయంతి నాటికి పూర్తయ్యేనా అను మానాలు తలెత్తుతున్నాయి. పనులు వేగవంతం చేయాలని పట్టణ వాసులు, బాబా భక్తులు కోరుతున్నారు.



నిర్మాణంలో ఉన్న పడమటి రోడ్డు

వీవీఐపీలు వచ్చే రోడ్డు..

ప్రశాంతి నిలయం పడమటి రోడ్డు నిర్మించాలని ఏళ్లుగా భక్తులు కోరుతున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరైనా బిల్లుల భయంతో కాంట్రాక్టర్లు ముందుకురాలేదు. గతేడాది కొలువుదీరిన కూటమి ప్రభుత్వం రోడ్డు నిర్మాణానికి చర్యలు చేపట్టింది. సత్యసాయి శత జయంత్యుత్సవాల నేపథ్యంలో రోడ్డు నిర్మాణానికి రూ.1.40 కోట్లు మంజూరు చేసింది. అధికారుల నిర్లక్ష్యం మూలంగా పనులను ఆలస్యంగా ప్రారంభించారన్న వాదనలు వినిపిస్తున్నాయి. పనులు సైతం నత్తనడకన సాగుతున్నాయి. ప్రశాంతి నిలయం గేటు నుంచి ఫోర్‌లైన్ రోడ్డు వరకు రూ.1.7 కిలోమీటర్ల మేర బీటీ రోడ్డు వేయాల్సి ఉంది. ఏడు మీటర్ల వెడల్పుతో రోడ్డు, మురుగు కాలువ, ఐదు కల్వర్టులు నిర్మించాల్సి ఉంది. ఇంతవరకు మొదటి లేయర్ కంకర మాత్రమే వేసి, రోలింగ్ చేస్తున్నారు. లక్షల మంది భక్తులు సత్యసాయి శతజయంతి వేడుకలకు వచ్చే అవకాశం ఉంది. భక్తుల రద్దీ అధికంగా ఉన్నపుడు వీవీఐపీలు పడమటి గేటు నుంచి ప్రశాంతి నిలయంలోకి ప్రవేశిస్తుంటారు. ఈ నేపథ్యంలో ఆ రోడ్డును యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాల్సి ఉంది. పనులు నత్తనడకన సాగుతుండడం శోచనీయం.

పదిరోజుల్లో పూర్తి చేస్తాం

పడమటి రోడ్డు వెడల్పు చేయాల్సి ఉంది. కొంత మేర కొండను తవ్వి రోడ్డు వేస్తున్నారు. కాస్త ఆలస్యమైంది వాస్తవమే. 10 రోజుల్లో పనులు పూర్తిచేస్తాం.

- స్వాతి, మున్సిపల్ ఏఈ, పుట్టపర్తి

బెండ రైతు బెంగ..!



- దిగుబడి తగ్గిన సీడ్‌బెండ
- పడిపోయిన ధరలు
- తుఫాన్‌తో మరింత నష్టం

(6లో...)

క్రీడల నిర్వహణను సవాల్‌గా తీసుకోవాలి

- సమష్టిగా పనిచేసి విజయవంతం చేయాలి
- కలెక్టర్ ఆనంద్

రీ సర్వే తెచ్చిన తంటా..!

పరిష్కారానికి నోచుకోని సమస్యలు

ఆందోళనలో రైతులు

తహసీల్దార్ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణ



బొమ్మనహాళ్ తహసీల్దార్ కార్యాలయం

బొమ్మనహాళ్, నవంబరు4(ఆంధ్రజ్యోతి): వైసీపీ పాపం.. రైతులకు శాపంగా మారింది. తాతల కాలం నుంచీ వస్తున్న భూమి తమది అని చెప్పుకోలేని దుస్థితి దాపురించింది. రీసర్వే పేరుతో గత వైసీపీ ప్రభుత్వం చేసిన రికార్డుల గందరగోళం నేటికీ కొనసాగుతోంది. పట్టా భూములను ప్రభుత్వానివిగా నమోదు చేశారు. నేటికీ ఆ సమస్యలు అలాగే ఉన్నాయి. గత వైసీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన ఎల్‌పీఎం విధానాలతో భూములు, స్థలాల క్రయవిక్రయాలకు ఇబ్బందులు తప్పడం లేదు. శాశ్వత భూహక్కు కల్పిస్తామని ఆర్భాటంగా చేపట్టిన రీసర్వే రైతుల పాలిట గుదిబండలా మారింది. సమస్యలు పరిష్కరించాలంటూ రైతులు.. బొమ్మనహాళ్ రెవెన్యూ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు. మండలంలోని 16 రెవెన్యూ గ్రామాల్లో నాలుగు చోట్ల పూర్తి చేశారు. ఉంతకల్లు, కొళగానహళ్లి, బొమ్మనహాళ్, ఉద్దేహాళ్, శింగానహళ్లి గ్రామాల్లో గత ప్రభుత్వంలో రీసర్వే నిర్వహించారు. రికార్డులు తప్పులతడకగా నమోదు చేశారని రైతులు వాపోతున్నారు. రెవెన్యూ అధికారులు.. తమను సంప్రదించకుండా డ్రోన్ కెమెరా ఆధారంతో రీసర్వే చేపట్టడంతో భూముల హద్దులు తారుమారు అయ్యాయని అన్నదాతలు వాపోతున్నారు. రీసర్వే విషయం కూడా చెప్పకపోవడం శోచనీయం. రీసర్వే సమస్యలను పరిష్కరించాలని రైతులు.. తహసీల్దార్ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణ చేస్తూ.. ఎలా చేయాలో తెలియడం లేదని అధికారులు తలలు పట్టుకుంటున్నారు. కూటమి ప్రభుత్వం రీసర్వే తప్పిదాలను సరిదిద్దేందుకు గ్రామసభలు నిర్వహించింది. అందులో 300కిపైగా అర్జీలు వచ్చాయి. ఏడాదిలో 150 పరిష్కరించారు. ఇంకా 150కిపైగా పెండింగ్‌లో ఉన్నాయి. ఎల్‌పీఎం, ప్రభుత్వ, దేవాలయ భూములుగా నమోదు చేసిన తప్పులను పరిష్కరించలేక పోతున్నారు. అధికారుల తప్పిదాల వల్ల తమకు బ్యాంకు రుణాలు రెన్యువల్ చేయడం లేదనీ, భూముల క్రయవిక్రయాలకు ఇబ్బందిగా మారిందని రైతులు వాపోతున్నారు. రీసర్వే తప్పులను సరిదిద్దడంలో ప్రస్తుత అధికారలు నిర్లక్ష్యం చేస్తున్నారని రైతులు వాపోతున్నారు. రీసర్వేల వల్ల గ్రామాల్లో తమ అనువంశిక, కొనుగోలు ఆస్తులు తప్పులుగా ఉన్నాయంటూ నిత్యం తహసీల్దార్ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తప్పులను సరిదిద్దాలని రైతులు కోరుతున్నారు.

ప్రభుత్వ భూమిగా చూపిస్తున్నారు



రీసర్వేలో నా పట్టా భూమిని అన్‌లైన్‌లో ప్రభుత్వ భూమిగా నమోదు చేశారు. సర్వే నంబరు 252లో 2.47, 283లో 2.29 మొత్తం 4.76 ఎకరాలను అన్‌లైన్‌లో ప్రభుత్వ భూమిగా చూపించారు. ఎల్‌పీఎం నంబరు ఏమిటో అర్థం కావడం లేదు తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా పరిష్కరించట్లేదు. బ్యాంకు అధికారులు.. పంట రుణమైనా చెల్లించు.. లేదంటే రెన్యూవల్ చేసుకో అని ఒత్తిడి చేస్తున్నారు.

-రుద్రప్ప, రైతు, ఉంతకల్లు

అన్నదమ్ముల భాగాలు కావడం లేదు



మా తల్లి లక్ష్మమ్మ పేరుపై సర్వే నంబరు 220, 221, ఎ1లో 7.19 ఎకరాల భూమి ఉంది. ఇద్దరు అన్నదమ్ములం భాగాలు చేసుకోవాలని రిజిస్ట్రార్ కార్యాలయనికి రికార్డులతో వెళితే ప్రభుత్వ భూమిగా ఉందని చెప్పారు. రెవెన్యూ అధికారులను అడిగితే రీసర్వేలో తప్పులు జరిగాయని అంటున్నారు. అధికారులు వెంటనే సమస్యను పరిష్కరించాలి.

-సిద్ధప్ప, రైతు, ఉంతకల్లు

రీసర్వే తప్పిదాలను పరిష్కరిస్తున్నాం



రీసర్వే తప్పిదాలను పరిష్కరిస్తున్నాం రైతుల నుంచి ఆధారాలు తీసుకుని, పరిశీలిస్తున్నాం. మండలంలో గతంలో జరిగిన రీసర్వేలో 100 ఖాతాలకుపైగా ప్రభుత్వ, దేవాలయ భూములుగా నమోదయ్యాయి. వాటిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తున్నాం.

-మునివేలు, తహసీల్దార్, బొమ్మనహాళ్





తరలిస్తున్న బెండ

బెండను నూర్పిడి చేస్తున్న రైతులు

బెండ రైతు బెంగ..!

- దిగుబడి తగ్గిన సీడ్ బెండ
- పడిపోయిన ధరలు
- తుఫాన్‌తో మరింత నష్టం

తాడిపత్రి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): సంప్రదాయ పంటలతో నిత్యం నష్టాలు చవిచూస్తున్న రైతులు.. ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసినా గట్టెక్కలేకపోతున్నారు. తాడిపత్రి పరిసర ప్రాంతాల్లో వేరుశనగ తదితర పంటల వల్ల రైతుకు ఆశించినంత దిగుబడి, ధర లేకపోవడంతో ప్రత్యామ్నాయ పంటల వైపు మొగ్గు చూపారు. తాడిపత్రి, పెద్దపప్పూరు, యాడికి తదితర మండలాల్లో దాదాపు 300 ఎకరాల్లో సీడ్ బెండ సాగుచేశారు. గత సంవత్సరం క్వింటా రూ. 15వేల నుంచి రూ.20వేల వరకు ధర ఉండేది. ప్రస్తుతం రూ.9,500 నుంచి రూ.10,500 వరకు పలుకుతుండడంతో నష్టపోతున్నామని రైతులు ఆందోళన చెందుతున్నారు. గతంలో ఎకరాకు 8 నుంచి 10 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చేది. ఈసారి వర్షాభావంతో రెండు నుంచి నాలుగు క్వింటాళ్లకు దిగుబడి పడిపోయిందని రైతులు చెబుతున్నారు.



సీడ్ బెండ

వర్షాధారంతో పండే ఈ ఒక్క పంటకు పెట్టుబడులు కూడా రాకపోవడంతో ఏడాది పొడవునా ఎలా జీవించాలో అర్థంకాని పరిస్థితి ఉందని పలువురు రైతులు ఆవేదన చెందుతున్నారు. ఎకరాకు రూ.20వేల నుంచి రూ.30వేల వరకు పెట్టుబడి వస్తుంది. దిగుబడి తగ్గిన పరిస్థితుల్లో ధర అయినా కొంత వరకూ ఉంటే ఊరటనిచ్చేది. పంట కోత, నూర్పుళ్లకు కూలీల ఖర్చు మరింత భారమవుతోంది. వీటికితోడు మొంథా తుఫాన్ వల్ల బెండ విత్తనం నాణ్యత తగ్గుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ ప్రాంతంలో సీడ్‌బెండ వ్యాపారులు లేకపోవడంతో.. నంద్యాల, ఆళ్లగడ్డ తదితర ప్రాంతాల నుంచి వచ్చి కొనుగోలు చేస్తారు. సీడ్‌బెండ విత్తనం ఆయుర్వేదం, సబ్బుల తయారీ తదితర వాటికి వాడతారని, ఇక్కడి నుంచి ఢిల్లీ తదితర ప్రాంతాలకు ఎగుమతి జరుగుతుందని వ్యాపారులు తెలిపారు. గతంలో నాణ్యతతోపాటు ధర కూడా బాగా ఉండేదని, ప్రస్తుతం నాణ్యత అంతంతమాత్రంగానే ఉండడంతోపాటు ధరలు తగ్గాయని వారు చెబుతున్నారు.

ఈ ఏడాది పూర్తిగా నష్టపోయా



నాకున్న 15 ఎకరాల్లో గత రెండు సంవత్సరాలుగా సీడ్‌బెండ సాగుచేస్తున్నా. గతంలో వేరుశనగ, సజ్జ, కంది తదితర పంటలు సాగుచేసి నష్టపోయాం. మంచి ధరలు ఉన్నాయనే ఆశతో సీడ్‌బెండ సాగు చేస్తున్నా. గత ఏడాది సీడ్‌బెండకు మంచి డిమాండ్ ఉండేది. దిగుబడి కూడా 8నుంచి 10క్వింటాళ్లు వచ్చింది. రూ.15 వేల నుంచి రూ.20వేల వరకు ధర పలకడంతో మంచి లాభాలు వచ్చాయి. ఈ ఏడాది పూర్తిగా నష్టపోయాం. ప్రభుత్వమే పరిహారం ఇచ్చి ఆదుకోవాలి.

-మహబూబ్‌బాషా, రైతు, చీమలవాగుపల్లి

పెట్టుబడులు కూడా రాలేదు



నాకున్న ఎనిమిది ఎకరాల్లో సీడ్‌బెండను సాగు చేశా. గతంలో మంచి దిగుబడితోపాటు ధర కూడా ఉండడంతో సీడ్‌బెండ వైపు మొగ్గుచూపా. ఈ ఏడాది వర్షాలు సరిగా పడకపోవడంతో దిగుబడి తగ్గింది. ఇదే సమయంలో ధర కూడా భారీగా పడిపోయింది. వీటివల్ల నష్టాలు చవిచూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. కనీసం పెట్టుబడులు కూడా రాకపోవడంతో ఏడాది పొడవునా ఎలా బతకాలో అర్థం కావడం లేదు. ధరలు పడిపోవడంతో అప్పులపాలయ్యాం. వీటికి తోడు మొంథా తుఫాన్ వల్ల బెండ నాణ్యత కూడా తగ్గింది. దీంతో ఏమి చేయాలో దిక్కుతోచడం లేదు. -నూర్‌బాషా, రైతు

సోలార్ ఫ్రీ..!



- ఎస్సీ, ఎస్టీలకు వరం
- గృహాలకు ఉచితంగా సోలార్ రూఫ్‌టాప్
- ముగిసిన టెండర్ల ప్రక్రియ
- జిల్లాలో 71వేల మందికిపైగా లబ్ధి
- 41 వేల మంది రిజిస్ట్రేషన్

సోలార్ రూఫ్‌టాప్ సామర్థ్యం	ఉత్పత్తయ్యే యూనిట్లు (సుమారు)	వినియోగదారుడికి ప్రస్తుతం వస్తున్నబిల్లు	ప్యానెల్ ఏర్పాటు తరువాత వచ్చే బిల్లు	ఏడాదికి ఆదా (సుమారు)
కిలో వాట్	120	రూ.1000	రూ.338	రూ.8వేలు
2 కిలో వాట్లు	240	రూ.2000	రూ.333	రూ.20వేలు
3 కిలో వాట్లు	360	రూ.3000	రూ.293	రూ.32,400

అనంతపురం రూరల్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీలకు సోలార్ విద్యుత్ ఉచితంగా లభించనుంది. వారి గృహాలపై సోలార్ ప్యానెళ్లను ఉచితంగా ఏర్పాటు చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపడుతున్నాయి. ఇందుకు సంబంధించి ఇప్పటికే టెండర్ల ప్రక్రియ ముగిసినట్లు విద్యుత్ శాఖాధికారులు చెబుతున్నారు. త్వరలోనే ప్యానెళ్ల ఏర్పాటు ప్రక్రియ కూడా మొదలవుతుందని చెబుతున్నారు.

జిల్లాలో 70 వేల ఎస్సీ, ఎస్టీ గృహాలు

జిల్లాలో అనంతపురం, కళ్యాణదుర్గం, గుత్తి విద్యుత్ డివిజన్లు ఉన్నాయి. వీటి పరిధిలో మొత్తంగా ఎస్సీ, ఎస్టీల గృహ విద్యుత్ కనెక్షన్లు 71,170 ఉన్నట్లు గుర్తించారు. ఆ మేరకు సంబంధిత వర్గాల నుంచి సోలార్ రూఫ్‌టాప్‌ల ఏర్పాటుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఇప్పటికే జిల్లాలో 41,223 మంది పేర్లను నమోదు చేసుకున్నట్లు అధికారుల లెక్కలు చెబుతున్నాయి.

రెండు కిలోవాట్ల వరకు ఉచితం

ఎస్సీ, ఎస్టీలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెండు కిలో వాట్ల (లోడ్) వరకు ఉచితంగా సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటు చేయనున్నాయి. ఇందుకు ఇళ్ల పైభాగంలో 10 చ.మీ. స్థలం అవసరం. అందులో కిలో వాట్ సామర్థ్యం కలిగిన సోలార్ సిస్టం ఏర్పాటు చేసుకునే వీలుంది. సోలార్ ప్యానెల్ ఏర్పాటు చేసుకుంటే విద్యుత్ బిల్లు భారం తగ్గనుంది. తద్వారా ఉత్పత్తయ్యే కరెంటులో ఇంటి అవసరాలకు పోను.. మిగులును విక్రయించుకోవచ్చు. తద్వారా ఆదాయం సమకూరుతుంది. మిగులు కరెంటు విక్రయం ద్వారా వచ్చే సొమ్మును నేరుగా వినియోగదారుడి ఖాతాలోకి జమచేయనున్నట్లు విద్యుత్ అధికారులు చెబుతున్నారు.

బీసీ వర్గాలకు రాయితీతో..

బీసీ వర్గాలకు రాయితీలో సోలార్ రూఫ్‌టాప్‌లు ఏర్పాటు చేయనున్నారు. కిలో వాట్ సామర్థ్యం కలిగిన సోలార్ ఫలకలు ఏర్పాటు చేసుకునేవారికి కేంద్ర ప్రభుత్వం రూ.30వేలు, రెండు కిలోవాట్లకు రూ.60 వేలు, మూడు కిలో వాట్ల వారికి రూ.78వేలు రాయితీ ఇస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం అదనంగా రూ.20వేలు సబ్సిడీ కల్పిస్తోంది. ఆసక్తి కలిగిన వినియోగదారులు ఆన్‌లైన్ ద్వారాగానీ, విద్యుత్ టోల్ ఫ్రీ నంబరు ద్వారాగానీ దరఖాస్తు చేసుకోవచ్చని అధికారులు చెబుతున్నారు.

టెండర్ల ప్రక్రియ పూర్తయింది



ఎస్సీ, ఎస్టీలకు సంబంధించి సోలార్ రూఫ్‌టాప్‌ల ఏర్పాటుకు టెండర్ల ప్రక్రియ పూర్తయింది. రిజిస్ట్రేషన్ చేసుకున్న వారికి ఏర్పాటు చేస్తారు. కంపెనీలను బట్టి సోలార్ ప్యానెళ్ల ధరలు ఉంటాయి. బీసీ వర్గాలకు రాయితీ ఇవ్వనున్నారు.

- శేషాద్రి శేఖర్, విద్యుత్ శాఖ ఎస్ఈ, అనంతపురం

అరటి ఆధారిత

వస్తువుల తయారీపై శిక్షణ

పుట్లూరు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): అరటి ఆధారిత వస్తువుల తయారీ యూనిట్ల ఏర్పాటుపై జిల్లాలో ఆసక్తి కలిగిన యువతీయువకులు దరఖాస్తు చేసుకోవాలని ఐకేపీ కార్యాలయ వర్గాలు మంగళవారం తెలిపాయి. ఈ నెల 6న రాప్తాడులోని టీటీడీసీలో అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అరటి పంట తర్వాత వేస్ట్‌గా తీసివేసిన భాగాల నుంచి దాదాపు 12రకాల వస్తువులను తయారుచేసి మార్కెట్ చేయవచ్చునన్నారు. జిల్లాలోని నిరుద్యోగ యువత ఇటువంటి యూనిట్లు ఇంటిలోనే ఏర్పాటు చేసుకొని ఖాళీ సమయంలో రోజుకు రెండుగంటలు పనిచేస్తే నెలకు రూ.15వేల నుంచి 20వేల వరకు సంపాదించుకొనే అవకాశం ఉందన్నారు. దీనికి అయ్యే పెట్టుబడిని రుణం రూపంలో తామే ఇస్తామన్నారు. ఇచ్చిన రుణానికి 50శాతం సబ్సిడీ కూడా ఉంటుందన్నారు.

సెలవులో వెళ్లిన డీఎంహెచ్ఓ

అనంతపురం వైద్యం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఈర్ల భ్రమరాంభిక దేవి సెలవుపై వెళ్లారు. వ్యక్తిగత కారణాలతో ఆమె మంగళ, బుధవారాలు సెలవు పెట్టారు. తిరిగి గురువారం విధుల్లో చేరుతారని కార్యాలయ వర్గాలు తెలిపాయి.

ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా ప్రొఫెసర్ శంకర్ నాయక్



ప్రభుత్వ వైద్య విద్య కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా ప్రొఫెసర్ ఆర్ శంకర్ నాయక్ బాధ్యతలు చేపట్టారు. ప్రిన్సిపాల్ డాక్టర్ విజశ్రీ ఈ నెల 7వరకు సెలవు పెట్టారు. ఫోరెన్సిక్ విభాగాధిపతి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శంకర్ నాయక్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు.

కన్నీటి వాన..!

(5వ పేజీ తరువాయి)

పుట్లూరు, కోమటికుంట్ల, బాలాపురం, గరుగుచింతలపల్లి, గోపరాజుపల్లి, తక్కళ్లపల్లి, నాయకునిపల్లి తదితర గ్రామాల్లో సుమారు 2,700 ఎకరాల్లో చీనీ సాగు చేస్తున్నారు.

ధరలు బాగున్నా..

చీనీకాయల ధరలు పెరుగున్నాయి. నెల రోజుల క్రితం టన్ను రూ.15వేల నుంచి 20వేల వరకు పలికాయి. ప్రస్తుతం రూ.25వేల నుంచి 30వేలకు పెరిగాయి. దిగుబడి బాగా వస్తే.. అప్పుల గుండం నుంచి బయటపడవచ్చని ఆశించిన రైతులకు నిరాశే ఎదురవుతోంది. వర్షం కారణంగా కాయలు రాలిపోయి, దిగుబడి ఆశించినస్థాయిలో రాలేదు. ఇంకా ధరలు పెరిగే అవకాశం ఉందని రైతులు చెబుతున్నారు. వర్షాలతో దిగుబడి దక్కక తీవ్ర నష్టం తప్పదని వాపోతున్నారు.

తోటల వద్దే పడేస్తున్నాం..



20 ఎకరాల్లో చీనీ సాగు చేశా. పంట కోత దశలో ఉంది. వర్షాల దెబ్బకు కాయలు విపరీతంగా రాలిపోతున్నాయి. పసుపు రంగులోకి మారిన కాయల వల్ల మిగిలినవి కూడా రాలిపోతున్నాయి. దీంతో తక్కువ ధరకే అమ్ముకోవాల్సి వస్తోంది. మార్కెట్‌లో రాలిపోయిన కాయలను తక్కువ ధరకు అడగుతుండడంతో తోటల వద్దనే పడేస్తున్నా.

- జయుడు, రైతు, కోమటికుంట్ల, పుట్లూరు మండలం

పెట్టుబడులు కూడా రాలేదు



ఐదెకరాల్లో చీనీ సాగుచేశా. ఈ ఏడాది వర్షాల వల్ల అవి కాస్తా పూర్తిగా రాలిపోయాయి. ఎకరాలో 120 చెట్లకు పెట్టుబడి రూ.లక్ష మేర వస్తుంది. వర్షాల వల్ల కాయలు ఇలా రాలిపోతే దిగుబడి తగ్గి నష్టపోవాల్సి వస్తోంది. పెట్టుబడులు కూడా రాలేదు.

- భాస్కర్‌నాయుడు, రైతు, కోమటికుంట్ల

రాలుతున్న కంది పూత



సాగు చేసిన కంది పంట

ఉరవకొండ డివిజన్ పరిధిలో 35,414 హెక్టార్లలో కంది సాగు చేశారు. పంట పెట్టి 120 రోజులు అయింది. పూత, పిందె దశలో ఉంది. తుఫాను వర్షాలకు పూత, పిందె రాలిపోతుండడంతో దిగుబడి తగ్గే అవకాశం ఉందని రైతులు వాపోతున్నారు. ఎకరాకు రూ.30వేలదాకా పెట్టుబడి పెట్టారు. పూత రాలిపోతే మళ్లీ రావాలంటే రసాయన మందులు పిచికారీ చేయాలి. అందుకు ఎకరాకి మరో రూ.6వేలు ఖర్చవుతుందని రైతులు చెబుతున్నారు. ఇది అదనపు ఖర్చు అని వాపోతున్నారు. వర్షాలకు తెగుళ్లు చుట్టుముడుతాయనీ, మచ్చ, కాయతొలిచే పురుగు ఆశించే అవకాశం ఉందని రైతులు పేర్కొన్నారు.

దిగుబడిపై ప్రభావం



ఐదెకరాల్లో కంది సాగు చేశా. ఎకరాకి రూ.30వేలు ఖర్చయింది. పూత రాలడంతో దిగుబడిపై ప్రభావం పడుతోంది. మళ్లీ పూత రావాలంటే మందులు కొట్టాలి. అదనంగా రూ.6 వేలు ఖర్చవుతుంది.

-కరీం, రైతు, షేక్లానుపల్లి

వరి రైతుల్లో వణుకు

తుఫాను వర్షాలు వరి పంటను తీవ్రంగా దెబ్బతీస్తున్నాయి. కోతకు సిద్ధంగా ఉన్న వరి పంట తడిసి నేలకొరుగుతుండటంతో తీవ్రంగా నష్టపోతున్నామని రైతులు వాపోతున్నారు. మంగళవారం ఉదయం తుఫాను ప్రభావంతో బొమ్మనహాళ్ మండలంలోని శ్రీధరఘట్ట, శింగానహళ్లి, రంగాపురం క్యాంపు, ఉప్పరహాళ్, ఎల్బీనగర్ తదితర గ్రామాల్లో వర్షం కురిసింది. గాలివానకు రంగాపురం క్యాంపు వద్ద కొంతవరకు వరిపంట నేలకొరిగింది. దీంతో రైతుల్లో ఆందోళన మొదలైంది. పంట ఎండే అవకాశం లేకపోవడంతో తేమ పెరిగి గింజల నాణ్యత దెబ్బతినే ప్రమాదం ఉందని వాపోతున్నారు. ఆరుగాలం శ్రమ తుఫానుతో వృథా అవుతుందేమోనని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వరి ధాన్యం నాణ్యత దెబ్బతినడంతో మార్కెట్‌లో సరైన ధర దక్కదేమోనని భయపడుతున్నారు. ఈ విషయమై మండల వ్యవసాయాధికారి సాయికుమార్‌ను అడగ్గా.. కోత దశకు వచ్చిన వరిపంట తడవకుండా వీలైనంత త్వరగా నీటిని బయటకు పంపే చర్యలు తీసుకోవాలని సూచిస్తున్నారు. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంట కోతలు చేసుకోవాలని అన్నారు.

శనగకు తేమ ముప్పు

యల్లనూరు(ఆంధ్రజ్యోతి): వరుస వర్షాలతో శనగ పంటకు తెగుళ్ల ముప్పు పొంచి ఉంది. 20 రోజులక్రితం మండలంలో పప్పుశనగ సాగుచేశారు. పంట విత్తినప్పటి నుంచి ఇప్పటికే మూడుసార్లు వర్షం కురిసింది. లేతదశలో ఉన్న ఈ పంటకు తేమ అధికమైతే నల్లమచ్చ తెగులు సోకే అవకాశం ఎక్కువగా ఉంటుందని రైతులు చెబుతున్నారు. సోమవారం రాత్రి కూడా ఓ మోస్తరు వర్షం కురిసింది. ఈ వర్షంతో కొన్నిపొలాల్లో నీరు అక్కడే నిలిచిపోయింది. ఇలా నీరు నిలవడం ద్వారా గతంలో నల్లమచ్చ తెగులు వ్యాపించి, పంటలు దెబ్బతిన్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలో 3వేల హెక్టార్లలో పంట సాగుచేశారు. విత్తినరోజునే వర్షం రావడంతో మొలకెత్తలేదని రైతులు తెలిపారు. ఇప్పటికే యల్లనూరు, పాతపల్లి, జంగంపల్లి, వెంకటాద్రిపల్లి, కాచర్లకుంట, కృష్ణాపురం గ్రామాల పరిధిలో సుమారు 500 ఎకరాల విస్తీర్ణంలో విత్తనం వేసినా మొలకెత్తలేదు. ఆయా పొలాల్లో తిరిగి విత్తనం వేయాల్సి ఉంటుంది. నల్లతెగులు ప్రభావం పైరుపై పడితే రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉంది.

ఆటతో ఆటలు..!

(5వ పేజీ తరువాయి)

తీవ్ర విమర్శలు వస్తున్నాయి. సాధారణంగా ఒక జట్టు ఎంపికకు వారం నుంచి పదిరోజుల గడువు తీసుకుంటారు. కానీ జిల్లా అండర్-14 బాలుర జట్టు ఎంపికకు ఏకంగా మూడు నెలల గడువు తీసుకున్నారు. సీజన్‌లో క్రికెట్ టోర్నీకి కనీసం 10-15 రోజుల ముందే జట్టును ఎంపిక చేసి, వారికి శిక్షణా శిబిరాన్ని ఏర్పాటు చేయాలి. అలా కాకుండా ఒక రోజు ముందు జట్టును ఎంపిక చేసి, హడావుడిగా పోటీలకు పంపించారు. ఈ నెల 1వ తేదీ నుంచి కడపలో మొదలైన అంతర్ జిల్లా క్రికెట్ టోర్నీకి గత నెల 31వ తేదీన జిల్లా జట్టును ఎంపిక చేశారంటే.. పరిస్థితి ఏమిటో అర్థం చేసుకోవచ్చు. ఇలా ఒక్క రోజు ముందు జట్టును ఎంపిక చేస్తే, సామగ్రిని సర్దుకుని పొరుగు జిల్లాకు పరిగెత్తడానికీ సమయం సరిపోదు. ఇక జట్టుకు ఎంపికైన క్రీడాకారులకు ఫిట్‌నెస్, సాధన మాటేమిటి..?

కుడి ఎడమైతే పొరపాటు లేదా..?

క్రికెట్ జట్టులో స్పెషలిస్టు బ్యాట్స్‌మెన్, బౌలర్లు, ఆల్‌రౌండర్లు ఉంటారు. ఎంతో అవసరం పడితేగానీ స్పెషలిస్టు బ్యాట్స్‌మెన్‌తో బౌలింగ్ వేయించరు. కానీ కడపలో జరిగిన మ్యాచ్‌లో ప్రధాన బ్యాట్స్‌మెన్ చేత మ్యాచ్ బౌలింగ్ వేయించారని, బౌలర్ల చేత బ్యాటింగ్ చేయించారని విమర్శలు వస్తున్నాయి. జట్టు ఎంపికతీరులో లోపాలకు ఇది అద్దం పడుతోందని పేరెంట్స్ కమిటీ విమర్శిస్తోంది. జట్టును సమర్థవంతంగా ఎందుకు నడిపించడం లేదని వారు నిలదీస్తున్నారు. జట్టు ఎంపికలో బీసీసీఐ, ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ నిబంధనలు పాటించడం లేదని బాధిత క్రీడాకారులు, వారి తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. అండర్-14 జట్టులో 14 ఏళ్ల లోపు వయస్సు క్రీడాకారులు ఉండాలని, కానీ నకిలీ జనన ధ్రువీకరణ పత్రాలతో 16 ఏళ్లవారు కూడా జట్టులో చోటు సంపాదించారని అంటున్నారు.

అన్నీ అనుమానాలే..

తక్కువ స్కోర్, తక్కువ వికెట్లు నమోదు చేసుకున్న క్రీడాకారులను జట్టుకు ఎంపి చేశారనే తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. సెలెక్టర్లు ఎటువంటి నిబంధనలు పాటించి క్రీడాకారులను ఎంపిక చేశారని వారు ప్రశ్నిస్తున్నారు. తమ బిడ్డలు చేసిన స్కోర్‌ను కూడా సరిగా నమోదు చేయలేదని, తక్కువ పరుగులు నమోదు చేసి వారి ఎదుగుదలను అడ్డుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ వివాదం పట్ల క్రీడాభిమానుల నుంచి ఆవేదన వ్యక్తమవుతోంది. ప్రశ్నించేవారు లేకనే ఈ పరిస్థితి ఏర్పడిందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. మాజీ ఐపీఎల్ ప్లేయర్ కనుసన్నల్లో ఇదంతా జరుగుతోందనే ప్రచారం ఉంది. ఓ ప్రైవేటు అకాడమీ కోచ్ కూడా జట్టు ఎంపికలో, ఆటలో మితిమీరిన జోక్యం చేసుకుంటున్నారని విమర్శలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో జిల్లా క్రికెట్ సంఘం సభ్యులను పలువురు తల్లిదండ్రులు కలిశారు. ప్రతిభగల పిల్లలకు జట్టులో చోటు కల్పించి న్యాయం చేయాలని వేడుకున్నారు. ఆంధ్రా క్రికెట్ సంఘం సభ్యులు, ఉమ్మడి జిల్లా ప్రజాప్రతినిధులకు తమ గోడు వినిపించామని పలువురు తెలిపారు.

నిబంధనల ప్రకారమే..

నిబంధనల ప్రకారమే క్రీడాకారుల ఎంపిక జరుగుతుంది. ఎంపికలో జిల్లా క్రికెట్ సంఘం ప్రమేయం ఉండదు. సెలెక్షన్ కమిటీ సూచించిన క్రీడాకారులను ఎంపిక చేస్తారు. సీజన్‌లో ఆట, ప్రాబబుల్స్‌లో ప్రతిభచాటిన క్రీడాకారులకే ప్రాధాన్యం ఇస్తారు. అండర్-14 బాలుర జట్టు ఎంపిక నిబంధనలకు లోబడే జరిగింది. సందేహాలకు అవకాశమే లేదు. వర్షం, ఇతరత్రా కారణాలతో ప్రాబబుల్స్ మ్యాచ్‌ల ప్రక్రియ ఆలస్యమైంది. జట్టులో చోటు కల్పించాలని పలువురు తల్లిదండ్రులు వచ్చి సంఘం సభ్యులను కలిసిన మాట వాస్తవమే.

బోగస్‌లకు ఏడీసీఏ సహకారం: చంద్రశేఖర్ చౌదరి



అండర్-14 క్రికెట్ జట్టులో బోగస్ బర్త్ సర్టిఫికెట్లు ఇచ్చిన వారికి ప్రాధాన్యం ఇచ్చి, అర్హులకు అన్యాయం చేస్తున్నారని ఓ క్రీడాకారుడి తండ్రి చంద్రశేఖర్ చౌదరి ఆవేదన వ్యక్తం చేశారు. నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎక్కువ వయస్సున్న క్రీడాకారులను నకిలీ ధ్రువపత్రాలతో అండర్-14 జిల్లా జట్టుకు జిల్లా క్రికెట్ సంఘం (ఏడీసీఏ) ఎంపిక చేయడం దారుణమని అన్నారు. బోగస్ సర్టిఫికెట్లు ఇచ్చిన వారిపై చర్యలు తీసుకోకుండా, అర్హులకు తీవ్ర అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. ఈ సీజన్‌తో పాటు ప్రాబబుల్స్ మ్యాచ్‌లలో ప్రతిభను పరిగణలోకి తీసుకోకుండా జట్టును ఎంపిక చేశారని అన్నారు. ప్రతిభ గల క్రీడాకారులను ప్రాబబుల్స్ మ్యాచ్‌లకు కూడా ఆడించలేదని, ఇది దుర్మార్గమని అన్నారు. 90 ఓవర్ల మ్యాచ్‌కు తన కుమారుడిని చివరి 5 ఓవర్లులో బ్యాటింగ్‌కి పంపించి.. సరిగా ఆడలేదని ఏడీసీఏ చెప్పడం సబబు కాదని అన్నారు. బర్త్ సర్టిఫికెట్, ఫిట్‌నెస్, బోన్‌టెస్ట్‌ను చేయకుండా అన్ని విభాగాల్లో ఇష్టానుసారంగా జట్టుకు ఎంపిక చేస్తున్నారని ఆరోపించారు. అండర్-14 బాలుర జట్టులో నలుగురు క్రీడాకారులు బోగస్ బర్త్ సర్టిఫికెట్లు పెట్టారనే విషయం ఏడీసీఏతో పాటు సెలెక్టర్లకు కూడా తెలుసని, అయినా పట్టించుకోకపోవడంలో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. జట్టు ఎంపిక పట్ల చాలా మంది క్రీడాకారులు, తల్లిదండ్రులు అసంతృప్తితో ఉన్నారని తెలిపారు. బోగస్ సర్టిఫికెట్లపై బహిరంగ విచారణకు తాము సిద్ధంగా ఉన్నామని ఏడీసీఏకు సవాల్ విసిరారు.



కలుపు నిరోధక పట్టలు వాడుతామని రైతులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న అధికారులు

తెగుళ్ల నివారణ ఇలా..

గార్లదిన్నె(ఆంధ్రజ్యోతి): ట్రైకోడెర్మా.. సుడోమోస్ మందులు పిచికారీ చేస్తే పండ్లతోటల్లో తెగుళ్లను నివారించుకోవచ్చని కృషివిజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త మాధవి సూచించారు. మండలంలోని బూదేడు గ్రామ పరిధిలో ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో బుధవారం రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. శాస్త్రవేత్త మాధవి మాట్లాడుతూ.. పండ్లతోటలకు వేరుకుళ్లు, బంక తెగుళ్లు సోకుతున్నాయన్నారు. వాటి నివారణకు ట్రైకోడెర్మా, సుడోమోస్ డ్రిప్ ద్వారా పిచికారీ చేస్తే తెగుళ్ల నివారణతోపాటు పండ్లమొక్కలు ఆరోగ్యంగా ఉంటాయన్నారు. పండ్ల తోటల్లో కలుపు నివారణ మందుల వినియోగం ద్వారా తీవ్ర దుష్పరిణామలు తలెత్తుతున్నాయన్నారు. కలుపు నిరోధక పట్టలు ఉపయోగించాలన్నారు. మొక్కల మొదలులో కలుపు నిరోధక పట్టలు వేయడం ద్వారా ఆ ప్రాంతంలో గడ్డి మొలవద్దన్నారు. దీంతో రైతులకు ఖర్చు తగ్గడంతోపాటు కలుపు బెడద తప్పుతుందన్నారు. ఆ మేరకు కలుపు నిరోధక పట్టలు వినియోగిస్తామని రైతులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఏపీఎంఐపీ పీడీ రఘునాథ్‌రెడ్డి, జిల్లా ఉద్యానవన శాఖాధికారి ఉమాదేవి, ఆత్మ పీడీ పద్మలత, ఏఓ సోమశేఖర్, రైతులు పాల్గొన్నారు.

ఏ విధి పగబట్టిందో...!

8 నెలల వ్యవధిలోనే తల్లిదండ్రుల మృతి

అనాథలుగా మారిన పిల్లలు



కుటుంబ సభ్యులతో వరలక్ష్మి

ముదిగుబ్బ, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): హాయిగా సాగుతున్న సంసారాన్ని విధి కాటేసింది. నెలల వ్యవధిలోనే తల్లిదండ్రులను బిడ్డలకు దూరం చేసి అనాథలను చేసింది. ముదిగుబ్బకు చెందిన ఓ కుటుంబ విషాద గాథ ఇది.. ముదిగుబ్బకు చెందిన శ్రీనివాసరెడ్డి(49) ఒక ప్రైవేటు సంస్థలో పనిచేసేవాడు. 8నెలల కిందట కూతురి ఇంటర్మీడియట్ పరీక్షల కోసం విజయవాడకు వెళ్లాడు. గుండెపోటు రావడంతో అక్కడే మరణించాడు. భార్య వరలక్ష్మి(40) నల్లచెరువు మోడల్ స్కూల్‌లో టీచర్‌గా పని చేస్తున్నారు. భర్త మరణం, అనారోగ్య సమస్యలతో ఆమె తీవ్రంగా కుంగిపోయారు. ఈక్రమంలోనే ఆరోగ్య పరిస్థితి మరింత విషమంగా మారింది. దీంతో ఆమెను సోమవారం మెరుగైన వైద్యం కోసం బెంగళూరులోని ఒక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందారు. వీరికి కుమార్తె, కుమారుడు ఉన్నారు. కుమార్తె హిమాన్సు విజయవాడలో ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతుండగా.. కుమారుడు కదిరిలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్నాడు. పిల్లల ఆలనా పాలనా వారి చిన్నాన్న మురళి చూసుకుంటున్నట్లు తెలిపారు. ఏడాది వ్యవధిలోనే తల్లిదండ్రులు మరణించడంతో ఇద్దరు పిల్లలు దిక్కులేని వారయ్యారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వంకలో పడి యువకుడి మృతి



బాబావలి (ఫైల్)

చెన్నేకొత్తపల్లి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని దామాజిపల్లి గ్రామానికి చెందిన బాబావలి(32) ప్రమాదవశాత్తు వంకలో పడి మృతిచెందిన సంఘటన మంగళవారం వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన మేరకు...గ్రామానికి చెందిన బాబావలి ఓ డాబాలో వంట మనిషిగా పనిచేస్తు కుటుంబాన్ని పోషించేవాడు. పనికోసం డాబాకు వెళ్తున్నట్లు సోమవారం ఇంట్లో చెప్పి వెళ్లాడు. ఈ క్రమంలో గ్రామ సమీపంలోని ప్రధాన రోడ్డు పక్కన ఉన్న ఎత్తైన కల్వర్టు నుంచి ప్రమాదవశాత్తు జారీ వంకనీటిలో మునిగిపోయాడు. మంగళవారం ఉదయం నీటిలో తేలాడుతున్న మృతదేహాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. మృతుడికి భార్యనజ్మున్, కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

గుర్తు తెలియని యువకుడి ఆత్మహత్య

ధర్మవరం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): స్థానిక రైల్వేస్టేషన్ సమీపంలోని కదిరి గేటు దగ్గరలో మంగళవారం ఉదయం ఓ గుర్తు తెలియని యువకుడు రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు. మృతుడికి 20 నుంచి 30 సంవత్సరాల మధ్య వయస్సు ఉంటుందన్నారు. మృతదేహంపై లేత నీలిరంగు షర్ట్, నలుపు రంగు ప్యాంట్ ఉన్నాయి. మృతుడి వివరాలు తెలిసిన వారు ధర్మవరం రైల్వే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. 8978656463, 9951325345 నంబర్లకు ఫోన్ చేయాలని రైల్వే పోలీసులు తెలిపారు.

ఏఎస్ఐనని చెప్పి మోసం

కుందుర్పి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): కొత్తగా వచ్చిన ఏఎస్ఐని అంటూ సైబర్ నేరగాళ్లు కుచ్చుటోపీ పెట్టారు. మండల కేంద్రానికి చెందిన ఇద్దరికి మోసం చేశారు. స్థానికంగా పెట్రోల్ బంక్ నిర్వహిస్తున్న సుదర్శన్ రెడ్డి ఓ నంబర్ నుంచి ఫోన్ వచ్చింది. తాను ఏఎస్ఐ ఆనందరావునని, కుందుర్పి స్టేషన్‌కు కొత్తగా వచ్చానని చెప్పారు. తమవారు ఆస్పత్రిలో ఉన్నారనీ, వెంటనే రూ.70 వేలు ఫోన్ పే చేయాలని ఓ నంబర్ ఇచ్చాడు. తరువాత పోలీసు స్టేషన్‌కు వచ్చి నగదు తీసుకెళ్లానన్నాడు. దానిని నమ్మిన సుదర్శన్ రెడ్డి ఆ మేరకు రూ.70 వేలు ఫోన్ పే చేశాడు. సమీపంలోనే సెల్‌పాయింట్ నిర్వహిస్తున్న అస్లాంబాషా అదే తరహాలో ఫోన్ చేసి, రూ.40 వేలు ఫోన్ పే చేయించుకున్నారు. తరువాత బాధితులిద్దరూ పోలీసు స్టేషన్‌కు వెళ్లారు. ఆనందరావు గురించి ఆరాతీయగా.. ఆ పేరుతో ఎవరూ లేరని చెప్పారు. దీంతో ఇద్దరూ అవాక్కయ్యారు. తమకు కాల్ వచ్చిన నంబర్‌కు ఫోన్ చేయగా.. పనిచేయలేదు. సైబర్ మోసంపై ఎస్ఐ నగేష్‌కు ఫిర్యాదు చేశారు. ఆ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

దీప స్తంభంపై సంస్కృత శాసనం



సంస్కృత శాసనాన్ని చూపుతున్న చరిత్రకారుడు మైనాస్వామి, పరిశోధకుడు గోపి

కొత్తచెరువు,నవంబరు4(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాతదేవరపల్లి గ్రామ సమీపంలోగల లక్ష్మీచెన్నకేశవస్వామి గుడిలోని దీప స్తంభంపై సంస్కృత శాసనం గుర్తించినట్లు చరిత్రకారుడు మైనాస్వామి, పరిశోధకుడు గోపి మంగళవారం తెలిపారు. సంస్కృత శాసనంలో శుభమస్తు సంభూత ధాత్రి తిత్వం ప్రరోహ అని ఉందన్నారు. (దీని అర్థం త్రిమూర్తులైన బ్రహ్మ, విష్ణు, మహేశ్వరుల కృపతో భూమండలం అభివృద్ధి చెందుతుంది.) గుడి ఎదురుగా ఉన్న రాతి పలక శాసనం తెలుగులో ఉందన్నారు. ఇందులో శాలివాహన శకం 1514 అంటే సామాన్య శకం1592 నాడు రాసినట్లు ఉందన్నారు. విజయనగర సామ్రాజ్య రెండో రాజధాని పెనుకొండ నుంచి పాలన సాగిస్తున్న అరవీటి వంశానికి చెందిన ఒకటో వెంకటపతి రాయల హయాంలో చేసిన భూ దాన అంశం ఇందులో రాసి ఉందని చరిత్రకారుడు మైనాస్వామి తెలిపారు. ఈ ఆలయానికి 120 ఎకరాల మాన్యం ఉందని ఆలయ అర్చకులు మాధవాచార్యులు తెలిపారు.

మైనింగ్ ప్రాంతాల్లో డ్రోన్ సర్వే



డ్రోన్ సర్వే చేస్తున్న అధికారులు

డి.హీరేహాళ్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): కర్ణాటక, ఆంధ్ర సరిహద్దు మైనింగ్ ప్రాంతంలో అధికారులు డ్రోన్ సర్వే చేస్తున్నారు. సరిహద్దులు చెరిపేసి అక్రమ మైనింగ్ చేపట్టారని సుప్రీంకోర్టుకు ఫిర్యాదులు అందాయి. దీంతో సరిహద్దు సమస్యను తేల్చే విషయమై ప్రభుత్వం త్రిసభ్య కమిటీ ఏర్పాటు చేసింది. వారంరోజులుగా రెవెన్యూ, అటవీశాఖ, మైనింగ్ ఇతర శాఖల అధికారులు బృందాలుగా ఏర్పడి ఈ సర్వేకు సంబంధించి ఏర్పాట్లను చేశారు. సోమవారం నుంచి మల్లప్పనగుడి గ్రామం సమీపంలో ఉన్న ఓఎంసీ మైనింగ్ కంపెనీ, అంతర్గంగా మైనింగ్ ప్రాంతాలలో సుమారు 100 ఎకరాలకుపైగా సర్వే చేపట్టారు. ఆయా మైనింగ్ కంపెనీల సరిహద్దులను డ్రోన్ పాయింట్ల ద్వారా గుర్తించారు. ఈ సర్వే ప్రక్రియ ఇంకా వారంరోజుల పాటు నిర్వహిస్తామని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో సర్వే రికార్డ్స్ డిప్యూటీ డైరెక్టర్ సూర్యారావు, రేంజ్ ఆఫీసర్ రామచంద్రుడు, డీఆర్ఓ దామోదర్‌రెడ్డి, సర్వేయర్ రవితేజ ఇతర అధికారులు పాల్గొన్నారు.

పంచాయతీలకు కొత్తరూపు

క్లస్టర్‌కు మంగళం.. గ్రేడ్ల కుదింపు

జీఓ జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం

అనంతపురం న్యూటౌన్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పంచాయతీల ముఖచిత్రం మారనుంది. అందుకు అనుగుణంగా ప్రిన్సిపల్ సెక్రటరీ శశిభూషణ్‌కుమార్ జీఓ ఎంఎస్‌నెంబర్.91ను మంగళవారం విడుదల చేశారు. దీని ప్రకారం ఇప్పటి వరకు ఉన్న క్లస్టర్ వ్యవస్థకు మంగళం పాడనున్నారు. గ్రేడ్లను కూడా కుదించి నాలుగింటికి పరిమితం చేయనున్నారు. పంచాయతీలను స్వతంత్ర యూనిట్‌గా ప్రకటించారు. జిల్లాలో ఉన్న 577 పంచాయతీలకుగాను స్పెషల్‌గ్రేడ్ పంచాయతీలు -14, గ్రేడ్-1 పంచాయతీలు-62, గ్రేడ్-2 పంచాయతీలు-218, గ్రేడ్-3 పంచాయతీలు-283గా నిర్ణయించారు. అందుకు అనుగుణంగా సిబ్బందిని నియమించడం కోసం యంత్రాంగం కసరత్తు చేస్తోంది. పంచాయతీ సెక్రటరీ పేరును కూడా పీడీఓ (పంచాయతీ డెవలప్‌మెంట్ ఆఫీసర్)గా మార్చనున్నారు. స్పెషల్ గ్రేడ్ పంచాయతీలకు సంబంధించి డిప్యూటీ ఎంపీడీఓ కేడర్ అధికారులను నియమించనున్నారు. పంచాయతీలకు ప్రతి విభాగం నుంచి ప్రత్యేక సిబ్బందిని నియమించనున్నారు. పారిశుధ్యం, నీటి సరఫరా, కంట్రీప్లానింగ్, వీధి దీపాలు, ఇంజనీరింగ్, రెవెన్యూ తదితర విభాగాలతో నూతనంగా సిబ్బందిని నియమించనున్నారు. పంచాయతీలను మొత్తం డిజిటలైజేషన్ చేయడంలో భాగంగా ఐటీ విభాగాన్ని కూడా అమలులోకి తీసుకురానున్నారు. దీంతో పంచాయితీల ముఖచిత్రం మొత్తం మారనుంది. ఈ ప్రక్రియ మొత్తాన్ని 2025-26 ఆర్థిక సంవత్సరంలో అమలులోకి తీసుకురానున్నారు.

క్రీడల నిర్వహణను సవాల్‌గా తీసుకోవాలి

సమష్టిగా పనిచేసి విజయవంతం చేయాలి

కలెక్టర్ ఆనంద్



సూచనలిస్తున్న కలెక్టర్ ఆనంద్

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి రెవెన్యూ క్రీడా, సాంస్కృతిక పోటీల నిర్వహణను సవాల్‌గా తీసుకుని, విజయవంతం చేయాలని అధికారులకు కలెక్టర్ ఆనంద్ ఆదేశించారు. పోటీల నిర్వహణపై స్థానిక ఆర్డీటీ స్టేడియంలో మంగళవారం సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ... పోటీల నిర్వహణ ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలన్నారు. అన్ని జిల్లాల నుంచి వచ్చే ఉద్యోగులకు సౌకర్యాలు కల్పించాలన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్, సీసీఎల్ఏ విజయలక్ష్మి, మంత్రులు హాజరవుతారన్నారు. ఏపీ రెవెన్యూ ఉద్యోగుల అసోసియేషన్ అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా 26 జిల్లాల నుంచి 3వేల మంది పోటీల్లో పాల్గొంటున్నారన్నారు. అనంతరం వేదిక, స్టేడియం, భోజనం, వసతి సదుపాయాల ఏర్పాట్లను పరిశీలించారు. కార్యక్రమంలో జేసీ శివనారాయణశర్మ, డీఆర్వో మలోల, అహుడా కార్యదర్శి రామకృష్ణారెడ్డి, రాష్ట్ర రెవెన్యూ ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి వెంకట రాజేష్, ఇరు జిల్లాల అధ్యక్షులు దివాకర్‌రావు, మధునాయక్, ఏఎంసీ కమిషనర్ బాలస్వామి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు దీప్తి, మల్లికార్జున, ఆనంద్ పాల్గొన్నారు.

దారి తప్పిన గురువు

విద్యార్థినుల పట్ల ఉపాధ్యాయుడి అసభ్య ప్రవర్తన

పాఠశాల వద్ద తల్లిదండ్రుల ఆందోళన

సస్పెండ్ చేసిన ఉన్నతాధికారులు



ఇన్‌చార్జ్ హెచ్‌ఎంకు వినతిపత్రాన్ని ఇస్తున్న గ్రామస్థులు

వజ్రకరూరు(ఉరవకొండ)/అనంతపురం విద్య, నవంబరు4 (ఆంధ్రజ్యోతి): పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పాల్సిన గురువు దారి తప్పాడు. తన వికృత చేష్టలతో వారిని వేధించసాగాడు. కొన్నాళ్లు మౌనంగా భరించిన పిల్లలు చివరకు వాటిని తాళలేక తల్లిదండ్రులకు తెలిపారు. దీంతో వారు ఆగ్రహంతో పాఠశాలకు చేరుకుని ఆందోళనకు దిగారు. ఉపాధ్యాయుడి వికృత చేష్టలపై ఇన్‌చార్జ్ హెచ్‌ఎంకు ఫిర్యాదు చేశారు. ఈ సంఘటన వజ్రకరూరు మండలంలోని వెంకటాంపల్లి జడ్పీ హైస్కూల్లో జరిగింది. వివరాలు ఇలా... పాఠశాలలో ఎస్ఏస్ టీచర్‌గా పని చేసే సుధాకర్ కొంతకాలంగా విద్యార్థులతో వికృతంగా ప్రవర్తించేవాడు. పిల్లల ద్వారా విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు ఆ ఉపాధ్యాయుడి తీరును నిరసిస్తూ పాఠశాల వద్ద మంగళవారం ఆందోళనకు దిగారు. ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేయాలని ఇన్‌చార్జ్ హెచ్‌ఎం జగదీష్‌కు విన్నవించారు. ఉపాధ్యాయుడి అసభ్య ప్రవర్తనపై నాలుగు రోజుల కిందటే తల్లిదండ్రులు ఫిర్యాదు చేయగా వారికి హెచ్‌ఎం సర్ది చెప్పినట్లు తెలిసింది. ఈక్రమంలో ఉపాధ్యాయుడు సుధాకర్ కూడా సెలవులో వెళ్లాడు. అయితే మంగళవారం ఆయన పాఠశాలకు వచ్చాడు. ఈ విషయం తెలుసుకున్న విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్థులు పాఠశాల వద్దకు చేరుకుని ఆందోళనకు దిగారు. ఈ విషయం తెలుసుకున్న ఎంఈఓ పాఠశాలకు చేరుకుని, విద్యార్థులను విచారించారు. పిల్లల అభిప్రాయాలను తీసుకున్నామని, నివేదికను జిల్లా విద్యాశాధికారులకు పంపుతున్నట్లు ఎంఈఓ తెలిపారు.

టీచర్ సుధాకర్ సస్పెన్షన్

క్షేత్రస్థాయి నుంచి వచ్చిన నివేదికను పరిశీలించిన జిల్లా ఉన్నతాధికారులు ఉపాధ్యాయుడు సుధాకర్‌ను సస్పెండ్ చేశారు. విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాల వద్ద గొడవకు దిగడం, మంత్రి పయ్యావుల కేశవ్ సొంత నియోజకవర్గం కావడంతో అధికారులు విషయాన్ని సీరియస్‌గా తీసుకున్నారు. సమస్య కలెక్టరు, కమిషనర్ దృష్టికి వెళ్లడంతో వెంటనే ఉపాధ్యాయుడు సుధాకర్‌ను సస్పెండ్ చేస్తున్నట్లు డీఈఓ ప్రసాద్‌బాబు ప్రకటించారు.

గొడవ నిజమే..!

హెచ్‌ఎం, ఉపాధ్యాయిని మధ్య వార్ వాస్తవమే

వజ్రకరూరు హైస్కూల్‌లో వివాదంపై విచారణ

అనంతపురం విద్య, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని వజ్రకరూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం, ఉపాధ్యాయురాలి మధ్య గొడవ నిజమేనని తేలింది. పాఠశాలలో జరుగుతున్న రగడ గురించి రాష్ట్రవిద్యాశాఖ ఉన్నతాధికారుల దృష్టికి పలు ఫిర్యాదులు వెళ్లాయి. దీంతో వారు ఇంత జరుగుతుంటే ఏమి చేస్తున్నారని జిల్లా విద్యాశాఖ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. దీంతో డీఈఓ ప్రసాద్‌బాబు వజ్రకరూరు హైస్కూల్ వివాదంపై విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని డిప్యూటీ డీఈఓ మల్లారెడ్డిని ఆదేశించారు. ఆయన మంగళవారం వజ్రకరూరు హైస్కూల్‌కు వెళ్లి, ఉదయం నుంచి సాయంత్రం వరకు హెచ్‌ఎం, టీచర్లు, ఇతర నాన్‌టీచింగ్ సిబ్బందితో మాట్లాడారు. అనంతరం హెచ్‌ఎం, గొడవ పడుతున్న టీచరమ్మతో పాటు ఇతర టీచర్లతో విడివిడిగా మాట్లాడి, జరుగుతున్న సంఘటనలపై ఆరాతీశారు. టీచరమ్మపైనే ఎక్కువ ఫిర్యాదులు వచ్చినట్లు సమాచారం. హెచ్‌ఎం కూడా అందరినీ కలుపుకొని పోవడం లేదని విచారణలో వెల్లడైనట్లు సమాచారం. దీనిపై విచారణాధికారి మల్లారెడ్డిని అడగగా, విచారణ చేశామని, అక్కడ వివాదం వాస్తవమేనని, దీనిపై నివేదికను డీఈఓకు అందజేస్తానని తెలిపారు.

ఢిల్లీలో సైన్స్ ఎగ్జిబిషన్‌కు

అనంత విద్యార్థిని



విద్యార్థినిని అభినందిస్తున్న కాలవ శ్రీనివాసులు

కణేకల్లు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని హనకనహాళ్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న గీతారెడ్డి ఢిల్లీలో నిర్వహించే సైన్స్ ఎగ్జిబిషన్‌కు ఎంపికైంది. అంతరిక్షశాస్త్రంపై ఈనెల 6నుంచి 8వ తేదీ వరకు ఢిల్లీలో జరిగే పాల్గొననుందని పాఠశాల హెచ్‌ఎం వేణుగోపాల్ తెలిపారు. ప్రతి జిల్లా నుంచి ఇద్దరిని ఎంపిక చేయగా.. అందులో గీతారెడ్డికి అవకాశం దక్కింది. విద్యార్థినిని అనంతపురం రైల్వే స్టేషన్‌లో ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు మంగళవారం అభినందించారు. సైన్స్ ఉపాధ్యాయులు చంద్రమునయ్య, మేడా ప్రసాద్ అభినందనలు తెలిపారు.

టేబుల్ టెన్నిస్ క్రీడాకారుల ఎంపిక

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా టేబుల్‌టెన్నిస్ క్రీడాకారులను ఎంపిక చేసినట్లు జిల్లా టేబుల్‌టెన్నిస్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు పాండురంగయ్య, కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. క్రీడాకారుల ఎంపిక పోటీలను నగరంలోని సప్తగిరిసర్కిల్‌లో ఉన్న అనంతపూర్ క్లబ్‌లో మంగళవారం నిర్వహించినట్లు తెలిపారు. అండర్-15 బాలుర విభాగంలో ఆదిత్య, చేతన్‌మురళీ, డి. ఫిరోజ్, ఆశ్రిత్, విశ్వనాథ్ ఎంపికయ్యారు. బాలికల విభాగంలో ఈషాసంజన, జ్ఞాపిక, హాసిని, ఐశ్వర్య, క్షిప్ర ఎంపికయ్యారు. సీనియర్ పురుషుల విభాగంలో కుషాల్, సాయిషా, వంశీకృష్ణ, జయాద్, గౌతమ్ ఎంపికయ్యారు. వీరు ఈనెల 17 నుంచి విశాఖపట్నంలో నిర్వహించే ఏపీ రాష్ట్ర టేబుల్‌టెన్నిస్ చాంపియన్‌షిప్-2025 పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో కోచ్‌లు రాజశేఖర్ రెడ్డి, రవీంద్రనాథ్, నజీమ్ పాల్గొన్నారు.

కరువు మండలాల ప్రకటనలో

జిల్లాకు అన్యాయం

వైసీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి



మాట్లాడుతున్న అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం కలెక్టరేట్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): కరువు మండలాల ప్రకటనలో జిల్లాకు తీవ్ర అన్యాయం చేశారని వైసీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి అన్నారు. వైసీపీ జిల్లా కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడారు. కూటమి అధికారంలోకి వచ్చాక గతేడాది ఖరీఫ్, రబీ సీజన్లలో కూడా భారీగా పంట నష్టం వాటిల్లిందన్నారు. దీనిపై ప్రజాప్రతినిధులు మాట్లాడలేదన్నారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లోనైనా ఆదుకుంటారనుకుంటే మొండిచేయి చూపారన్నారు. ఖరీఫ్‌లో జూన్ 5 నుంచి ఆగస్టు తొలివారం వరకు 55 రోజులపాటు జిల్లాలో వర్షం కురవలేదన్నారు. సీజన్‌లో నాలుగు నెలలను పరిగణనలోకి తీసుకుని సాధారణ వర్షపాతంగా ప్రభుత్వానికి నివేదిక పంపి, రైతాంగాన్ని నట్టేట ముంచారని మండిపడ్డారు. శ్రీసత్యసాయి జిల్లాలో 25 మండలాలను కరువు ప్రాంతాలుగా ప్రకటించిన ప్రభుత్వం పక్కనే ఉన్న అనంతపురంలో ఒక్క మండలానికీ జాబితాలో చోటివ్వలేదన్నారు. రబీ సీజన్‌కు సంబంధించి సబ్సిడీతో పప్పుశనగ విత్తన పంపిణీలోనూ ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని విమర్శించారు. ఇప్పటికైనా పునఃసమీక్ష చేసి కరువు మండలాలు ప్రకటించాలని డిమాండ్ చేశారు. అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ వివాదాలు, అవినీతి బురదలో కూరుకుపోయి.. దానిని అందరికీ అంటించాలని చూస్తున్నారన్నారు. తాను సుదీర్ఘకాలంగా రాజకీయాల్లో ఉన్నాననీ, ఇలా వివాదాలు, అవినీతి బురదలో దిగిన వారిని చూడలేదన్నారు. అక్రమాలపై ప్రశ్నిస్తే తనపై విమర్శలు చేస్తున్నారనీ, బెదిరించి మాట్లాడకుండా గొంతు నొక్కుతామంటే భయపడేవాడిని కాదన్నారు. ముగ్గురు అన్నదమ్ములం కలిసే ఉన్నామనీ, తమకు 450 ఎకరాలు ఎక్కడున్నాయో చూపించి ఇస్తే మంచిదే అన్నారు. తన పక్కనున్న ఒకరిద్దరు కట్టప్పల మాటలు విని ఏదంటే అది మాట్లాడితే భయపడేవాడిని కాదన్నారు. అందరికీ బుద్ధి చెబుతానని అనంత హెచ్చరించారు.

పీఏబీఆర్‌కు పెరిగిన ఇన్‌ఫ్లో

కూడేరు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): పీఏబీఆర్(పెన్నహోబిలం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్)కి ఇన్‌ఫ్లో పెరిగింది. రెండు రోజులుగా డ్యాంలోకి హంద్రీ-నీవా నుంచి 660 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుండటంతో జల విద్యుత్ ఉత్పత్తి కొనసాగిస్తున్నారు. డ్యాంలోకి హంద్రీనీవాతోపాటు లింక్ చానల్ నుంచి వస్తున్న నీరు దాదాపు 700 క్యూసెక్కులుగా ఉంది. జల విద్యుత్ కేంద్రంలో ఒక టర్బైన్‌కు 785 క్యూసెక్కుల నీటిని నియోగిస్తూ కరెంటు ఉత్పత్తి చేస్తున్నారు. ఇన్‌ఫ్లో ఆధారంగా ఔట్‌ఫ్లో కొనసాగిస్తున్నట్లు ఏఈఈ లక్ష్మీదేవి తెలిపారు. మంగళవారం డ్యాంలో 5.157 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు.

నేడు ఈ ప్రగతి యాప్‌పై శిక్షణ

అనంతపురం న్యూటౌన్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ఈ ప్రగతి యాప్ వినియోగంపై బుధవారం శిక్షణ ఇవ్వనున్నట్లు జడ్పీ సీఈఓ శివశంకర్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని ప్రతి మండలం నుంచి ఒక జూనియర్ అసిస్టెంట్ లేదా టైపిస్టు లేదా కంప్యూటర్ ఆపరేటర్లలో ఎవరో ఒకరు శిక్షణ పొందాలన్నారు. దీనిపై ఆయా మండలాల ఎంపీడీఓలు బాధ్యత తీసుకోవాలన్నారు. ఈ శిక్షణను జడ్పీ ఆవరణలోని పంచాయతీ వనరుల కేంద్రం సమావేశ భవనంలో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఉదయం 9.30 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు శిక్షణ ఉంటుందన్నారు.

ఆంధ్ర జట్టుకు ముగ్గురు జిల్లా క్రికెటర్లు



ఎంకే దత్తారెడ్డి



మహ్మద్ కమిల్



మల్లికార్జున

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ఆంధ్రా అండర్-23 వన్డే క్రికెట్ జట్టుకు జిల్లాకు చెందిన ముగ్గురు క్రికెటర్లు ఎంపికయ్యారు. మహ్మద్‌కమిల్, ఎంకే దత్తారెడ్డి, మల్లికార్జున చోటు దక్కించుకోగా.. స్టాండ్‌బైగా అర్జున్ టెండూల్కర్‌ను ఎంపిక చేశారు. వీరు ఈనెల 9 నుంచి బరోడాలో నిర్వహించే అండర్-23 జాతీయస్థాయి వన్డే క్రికెట్ టోర్నీలో ఆంధ్ర జట్టు తరఫున ఆడతారు. వీరిని జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి భీమలింగారెడ్డి అభినందించారు.

ఎదురీదుతున్న పాండిచ్చేరి



ఆల్‌రౌండర్ రాజు



కిషన్‌యాదవ్

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు4(ఆంధ్రజ్యోతి): సీకే నాయుడు జాతీయ క్రికెట్ టోర్నీలో భాగంగా ఆంధ్ర అండర్-23 జట్టుతో జరుగుతున్న పోరులో పాండిచ్చేరి జట్టు ఎదురీదుతోంది. పాండిచ్చేరి-ఆంధ్రా అండర్-23 జట్ల మధ్య జరుగుతున్న మ్యాచ్‌లో మూడో రోజు ఓవర్‌నైట్ స్కోర్ 184-3తో ఇన్నింగ్స్ ఆరంభించిన ఆంధ్రా జట్టు 9వికెట్లు కోల్పోయి 341పరుగల వద్ద డిక్లేర్ చేసింది. బ్యాటర్ తేజ (105) సెంచరీ చేయగా, అభినవ్ 48పరుగులు, రాజు 55పరుగులు, ఆకాష్ 35పరుగులు చేశారు. పాండిచ్చేరి బౌలర్ కిషన్‌యాదవ్ 6వికెట్లు తీశాడు. అనంతరం రెండో ఇన్నింగ్స్‌లో 14.3ఓవర్లలో 4వికెట్లు కోల్పోయి 37పరుగులు చేసింది. ఆంధ్రా బౌలర్ 3వికెట్లు తీయగా, సుమిత్ వికెట్ తీశాడు. దీంతో చివరి రోజు ఆటపై ఆసక్తి నెలకొంది. కార్యక్రమంలో జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి భీమలింగా రెడ్డి, సభ్యులు, కోచ్‌లు తదితరులు పాల్గొన్నారు.



ఎంపికైన ఎస్‌జీఎఫ్ అండర్-14 నెట్‌బాల్ జిల్లా బాల బాలికల జట్లు

నెట్‌బాల్ బాల బాలికల జట్ల ఎంపిక



ఎంపికైన ఎస్‌జీఎఫ్ అండర్-19 నెట్‌బాల్ జిల్లా బాల బాలికల జట్లు

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ఎస్‌జీఎఫ్ అండర్-14, 19 బాల, బాలికల జిల్లా జట్లను మంగళవారం ఎంపిక చేశారు. స్థానిక న్యూటౌన్ బాలుర జూనియర్ కళాశాల మైదానంలో ఎస్‌జీఎఫ్-14, 19 నెట్‌బాల్ బాల, బాలికల క్రీడాకారుల ఎంపిక పోటీలు నిర్వహించారు. ఎంపికైన క్రీడాకారుల వివరాలను ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు తెలిపారు.

- అండర్-14 బాలికల విభాగంలో సుకన్య, మధు, శ్రీజ, అమృత, హర్షిత, దీపాలి, రాఘవశ్రీ, నవ్య, సానియా, సునీత, సౌమ్య, నేత్రలు ఎంపికయ్యారు.
- బాలుర విభాగంలో పవన్‌కుమార్, నవాజ్, మోక్షిత్, రాజు, కార్తీక్, మధుసాయి, భరత్, బాబ్జాన్, మనోజ్, తేజ్‌కుమార్, నరేంద్ర, ధనుంజయ ఎంపికయ్యారు.
- అండర్-19 బాలికల విభాగంలో దీపిక, నందిని, సృజన, పూజ, అలియా అంజుం, హన్సిక, సంయుక్త, కల్పన, అమృత, చైత్ర, శుభాశ్రీ, గీతలు ఎంపికయ్యారు.
- బాలుర జట్టులో నరేంద్ర, జాఫర్, ప్రణీత్‌కుమార్, చరణ్, నాగచైతన్య, హరికృష్ణ, బాబా, అశోక్, రామ్‌చరణ్, కార్తీక్, చేతన్, నానిలు ఎంపికయ్యారు.

కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ ప్రతినిధులు శకుంతల, లక్ష్మీనారాయణ, సుహాసిని, పీడీలు రవీంద్ర, వేణు, చరణ్, సునీల్, ఈశ్వర్‌రెడ్డి,, గోవిందు, రమేష్ పాల్గొన్నారు.

విధుల్లో అప్రమత్తంగా ఉండండి: ఎస్ఈ

అనంతపురంరూరల్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): విధుల్లో అప్రమత్తంగా ఉంటూ పనిచేయాలని విద్యుత్ శాఖ ఎస్ఈ శేషాద్రి శేఖర్ సూచించారు. మంగళవారం జేఎన్‌టీయూ రోడ్డులోని విద్యుత్ శాఖ ప్రధాన కార్యాలయం మీటింగ్ హాల్‌లో అనంతపురం డివిజన్ పరిధిలోని సబ్‌స్టేషన్‌లలో పనిచేస్తున్న షిఫ్ట్ ఆపరేటర్లు, జేఎల్‌ఎంలు, పోల్‌టూపోల్ సిబ్బందికి విద్యుత్ భద్రతపై వర్క్‌షాపు నిర్వహించారు. డివిజన్ ఈఈ జేవీ రమేష్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ఎస్ఈ శేషాద్రి శేఖర్, టెక్నికల్ ఈఈ ప్రసాద్, అనంతపురం డివిజన్ ఈఈ జేవీ రమేష్, అసిస్టెంట్ లేబర్ కమిషనర్ లావణ్య, ఏపీటీఎస్ సీఐ విశ్వనాథ్‌చౌదరి హాజరయ్యారు. ఎస్ఈ మాట్లాడుతూ విద్యుత్ మరమ్మతుల సమయంలో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. చిన్న తప్పిదాలు కూడా పెద్ద ప్రమాదాలకు దారి తీస్తాయన్నారు. అసిస్టెంట్ లేబర్ కమిషనర్ లావణ్య ఈశ్రామ్, ఇతర బీమా పథకాల గురించి వివరించారు. అనంతరం సిబ్బందికి సేఫ్టీ కిట్లను అందజేశారు. కమర్షియల్ విభాగం డీఈఈ రామకృష్ణ, ఆపరేషన్ డీఈఈలు శ్రీనివాసులు, చంద్రశేఖర్, రఘు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

దరఖాస్తులను ఆమోదించవద్దు


తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న మైనార్టీ నాయకులు

ధర్మవరం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఖాజీ పోస్టు ఏర్పాటుకు సంబంధించిన దరఖాస్తులను ఆమోదించవద్దని మదీన మసీదు ముతవల్లి నాగుర్‌హుస్సేన్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయనతోపాటు ముస్లిం మతపెద్దలు తహసీల్దార్ సురేశ్‌బాబుకు వినతి పత్రం అందజేశారు. అనంతరం ముతవల్లి మాట్లాడుతూ.. ఇటీవల కొంతమంది వ్యక్తులు స్వప్రయోజనాల కోసం, స్థానిక మసీదు కమిటీలు, మత పెద్దల అనుమతి లేకుండానే ఖాజీ పోస్టు ఏర్పాటుకు దరఖాస్తులు ఆహ్వానించారని తెలిపారు. ఇలాంటి చర్యలు ముస్లిం సమాజంలో విభేదాలు, అపార్థాలు, అశాంతి సృష్టించే ప్రమాదం ఉందని వివరించారు. కార్యక్రమంలో మదీన మసీదు కార్యదర్శి అజీజ్, జామియా మసీదు కార్యదర్శి ఫారూక్, అంజుమన్ కమిటీ అధ్యక్షుడు బాషా, ఉపాధ్యక్షుడు ఇస్మాయిల్ పాల్గొన్నారు.

కాలనీవాసులకు నోటీసుల జారీ

గాండ్లపెంట, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో వీధుల్లోకి నీరు వదులుతున్న గంగమ్మ కాలనీ వాసులకు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ సునీత, పంచాయతీ కార్యదర్శి శివమూర్తి నోటీసులు జారీ చేశారు. గంగమ్మ కాలనీవాసులు మురుగునీరు రోడ్లపైన వదులుతున్నారని ఈ నెల 1న ఆంధ్రజ్యోతిలో 'రోడ్లపైకి మురుగునీరు.. పట్టించుకోని అధికారులు' అనే శీర్షికన ప్రచురితమయింది. అందుకు అధికారులు స్పందించి మురుగునీరు రోడ్లపైకి వదిలే కాలనీవాసులకు నోటీసులు జారీ చేశారు. మరోసారి వీధుల్లోకి నీరువదిలితే పంచాయతీ శాఖ చర్యలు తీసుకుంటుందని హెచ్చరించారు.

ఐఆర్ ప్రకటించాలి: యూటీఎఫ్

నంబులపూలకుంట, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ఉద్యోగ, ఉపాధ్యాయులకు ప్రభుత్వం వెంటనే ఐఆర్ ప్రకటించాలని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి తాహేర్‌వలీ పేర్కొన్నారు. మంగళవారం మండలం లో యూటీఎఫ్ సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా ఆ యన మాట్లాడుతూ.. ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు ఐఆర్ ప్రకటించాలని కోరారు. ప్రభుత్వ ఇన్‌సర్వీస్ టీచర్లకు టెట్ నుంచి మినహాయించాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వంపై ఉపాధ్యాయులు ఎన్నో ఆశలు పెట్టుకున్నారని, తమకిచ్చిన హామీలు నేరవేర్చలేదని అన్నారు. యాప్‌ల భారం తొలగించి ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు మల్లికార్జున, హనీఫ్‌ఖాన్, ఖాజా మోహియోద్దీన్, మహేశ్వర్‌రెడ్డి, మురళీ, ముషీర్, అయూబ్, బాబ్‌జాన్ పాల్గొన్నారు.

అయ్యప్పస్వామి విగ్రహ ప్రతిష్ఠకు తరలిరండి

గాండ్లపెంట, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కదిరి - రాయచోటి ప్రధాన రహదారిలో చిన్నమిట్ట వద్ద నూతనంగా నిర్మించిన అయ్యప్పస్వామి ఆలయ విగ్రహ ప్రతిష్ఠ ఆహ్వాన పత్రికలను మంగళవారం ఆలయ కమిటీ సభ్యులు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. ఈ నెల 6 నుంచి 10వ తేదీ వరకు అయ్యప్పస్వామి ఆలయ ప్రతిష్ఠ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు లక్ష్మీనరసింహగౌడ్, సిద్దారెడ్డి, రఘునాథరెడ్డి, రామ్మోహన, సోమశేఖరరెడ్డి, నాగరాజు, గంగయ్య యాదవ్, వెంకటేశ్వర్లు, మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఐటీయూ నాయకుడికి నివాళి

ధర్మవరం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): సీఐటీయూ నాయకుడు సయ్యద్ హైదర్‌వలీ మృతికి పలువురు నివాళి అర్పించారు. తిరుపతి రుయా ఆసుపత్రిలో చికిత్సపొందుతూ ఆయన మృతి చెందారు. మంగళవారం రైతుసంఘం జిల్లా నాయకులు జంగాలపల్లి పెద్దన్న, సీపీఎం నాయకుడు ఎస్‌హెచ్ బాషా, సీఐటీయూ నాయకులు అయూబ్‌ఖాన్, ఆదినారాయణ, చేనేత నాయకులు ఖాదర్‌బాషా తదితరులు హైదర్‌వలీ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సీపీఎం, సీఐటీయూకు ఆయన చేసిన సేవలను కొనియాడారు.

జగనన్న కాలనీలో పోలీసుల తనిఖీ

బత్తలపల్లి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన బత్తలపల్లిలోని జగన్ అన్న కాలనీలో మంగళవారం తెల్లవారు జామున సీఐ ప్రభాకర్ ఆధ్వర్యంలో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. అనుమానితుల ఇళ్లు, వాహనాలను పరిశీలించారు. రికార్డులు లేని వాహనాలను సీజ్ చేసి స్టేషన్‌కు తరలించారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు సోమశేఖర్, శ్రీనివాసులు, ప్రసన్న, సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

ధర్మవరంరూరల్, నవంబరు4(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిగిచెర్ల ఉన్నతపాఠశాల విద్యార్థులు స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ అండర్-17 పోటీలలో జూడోలో రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు పీడీ ప్రతాప్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఈనెల 1న అనంతపురంలో జరిగిన జిల్లాస్థాయి పోటీలలో విద్యార్థులు సత్తాచాటి రాష్ట్రస్థాయికి ఎంపికైయ్యారని తెలిపారు. బాలుర 45 కిలోల విభాగంలో యశ్వంత్, 50 కిలోల విభాగంలో విక్రాంత్, 55 కిలోలవిభాగంలో అఫ్జల్‌మెహరాజ్, 66 కిలోల విభాగంలో సాకే ఈశ్వర్ ఎంపికయ్యారని వివరించారు. బాలికల కేటగిరీలో 36 కిలోల విభాగంలో నందిని, 40 కిలోల విభాగంలో యశ్విత, 48 కిలోల విభాగంలో లాస్యరెడ్డి, 52 కిలోల విభాగంలో యశస్విని ఎంపికైనట్లు పీడీ తెలిపారు. ఈనెల 6 నుంచి 9 వరకు కాకినాడలో రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

వడ్డెర్ల అభివృద్ధికి సహకరించండి

కొత్తచెరువు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): వడ్డెర కార్పొరేషన్‌కు నిధులు కేటాయించి వడ్డెర్ల అభివృద్ధికి సహకరించాలని మంత్రి సవితకు వినతి పత్రం ఇచ్చినట్లు డైరెక్టర్ వలిపి శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం విజయవాడలో జరిగిన రాష్ట్ర వడ్డెర్ల సదస్సులో వినతి పత్రం ఇచ్చినట్లు వివరించారు.


తప్పిన ప్రాణాపాయం

కొత్తచెరువు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని నెహ్రూ కూడలిలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రాణాపాయం తప్పింది. స్థానికులు తెలిపిన వివిరాల మేరకు.. టీవీఎస్ నడుపుకుంటూ ఒక వ్యక్తి నెహ్రూ సర్కిల్ మీదుగా పుట్టపర్తి వైపు వెళుతున్నాడు. సర్కిల్‌లోని రోడ్డుపై పడ్డ గుంతల వల్ల టీవీఎస్ అదుపు తప్పి కింద పడింది. వెనుక వైపు నుంచి వచ్చిన సిమెంట్ లారీ డ్రైవర్ సడన్ బ్రేక్ వేయడంతో రోడ్డుపై ఉన్న జనం టీవీఎస్ నడిపే వ్యక్తిని ఒక్కసారిగా బయటకు లగడంతో ప్రాణాపాయం తప్పిందని తెలిపారు. రోడ్డుపై పడ్డ గుంతల కారణంగా తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని వాహనదారులు అంటున్నారు. గుంతలకు తారు వేయాలని ఆర్అండ్‌బీ అధికారులకు తెలిపినా పట్టించుకోలేదన్నారు.


నెహ్రూ సర్కిల్లో లారీ కింద పడ్డ స్కూటర్

ట్రాన్స్‌కో.. జర దేఖో..!

● విద్యుత్ వైర్లకు అల్లుకున్న తీగలు
● పట్టించుకోని అధికారులు


రామస్వామి గుడి వెనుక విద్యుత్ వైర్లకు అల్లుకున్న పచ్చని తీగలు

గాండ్లపెంట, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ఏదైనా ప్రమాదం జరిగితే కానీ ట్రాన్స్‌కో అధికారులు స్పందించరేమోనని ఈ చిత్రాన్ని చూస్తే అర్థమవుతుంది. సాక్షాత్తూ మండల కేంద్రంలో విద్యుత్ వైర్లకు పచ్చని తీగలు అల్లుకున్నా ఆ శాఖ అధికారులు ఏమాత్రం పట్టించుకోలేదు. గాండ్లపెంటలోని రామస్వామి ఆలయం వెనుక వీధిలో ముళ్లకంపలు, తీగలు విద్యుత్ వైర్లను చుట్టేశాయి. నిత్యం ఆ వీధులలో కాలనీవాసులు తిరుగుతుంటారు. ఎప్పుడు ఎలాంటి ప్రమాదం సంభవిస్తుందోనని కాలనీల వాసులు ఆందోళన చెందుతున్నారు. ఈ విషయంపై ట్రాన్స్‌కో సిబ్బందికి కూడా తెలియజేసినా పట్టించుకోలేదని స్థానికులు మండిపడుతున్నారు. విద్యుత్‌వైర్లకు పచ్చని కొమ్మల తీగలు అల్లుకోవడంతో వర్షాకాలంలో నిత్యం విద్యుత్ అంతరాయం ఏర్పడుతోందని చెబుతున్నారు. తీగలు, ముళ్ల చెట్లు కింది నుంచి అల్లుకుని పోయాయని, వాటిని తాకితే విద్యుత్ షాక్ కొట్టి ప్రమాదం జరిగే పరిస్థితి ఉందని వాపోతున్నారు. అధికారులు స్పందించి విద్యుత్ వైర్లకు ఉన్న తీగలు తొలగించి ప్రమాదాలు నివారించి, విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని కాలనీవాసులు నారాయణరెడ్డి, సాంబశివారెడ్డి, రఫీ తదితరులు కోరారు.

తీగలను తొలగిస్తాం

విద్యుత్ వైర్లకు ఎగబాకిన తీగలను తొలగించి ఎలాంటి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకుంటాం. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా చూస్తాం. -ప్రసాద్, లైన్ ఇన్‌స్పెక్టర్

అభివృద్ధి పనుల్లో వేగం పెరగాలి

ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి


అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే, మాజీమంత్రి

పుట్టపర్తిరూరల్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): సత్యసాయి శతజయంతి ఉత్సవాలు సమీపిస్తున్నాయని, అభివృద్ధి పనుల్లో మరింత వేగం పెరగాలని ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, మాజీమంత్రి పల్లె రఘునాథరెడ్డి అధికారులకు సూచించారు. సత్యసాయి జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని పుట్టపర్తిలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను వారు ఆర్డీఓ సువర్ణ, మున్సిపల్ కమిషనర్ క్రాంతికుమార్, పబ్లిక్ హెల్త్ డీఈ నరసింహామూర్తితో కలసి మంగళవారం పరిశీలించారు. సుందరీకరణ పనుల్లో భాగంగా నిర్మితమవుతున్న చిల్డ్రన్స్‌పార్క్, చిత్రావతి బ్రిడ్జిపై జరుగుతున్న వీధి దీపాల ఏర్పాటు, కర్ణాటక నాగేపల్లి వద్ద వారపుసంత నిర్వహించడానికి చేస్తున్న పనులను పరిశీలించారు. చిత్రావతికి ఇరువైపుల అక్రమకట్టడాలను తొలగించి తారు రోడ్డువేయాలని తెలిపారు. పట్టణంలో డివైడర్లకు రంగులు వేసి మధ్యలో మొక్కలను ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం చిత్రావతి నదిఒడ్డున ఏర్పాటవుతున్న చిల్డ్రన్స్ పార్క్‌లో జిమ్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ, నాయకులు రామాంజనేయులు, గంగాధర్ నాయుడు, షామీర్, హరికృష్ణ, జ్యోతిప్రసాద్, తదితరులు పాల్గొన్నారు. క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, మాజీమంత్రి పల్లె రఘునాథరెడ్డి లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందచేశారు.

ఆర్టీసీ ఎండీకి స్వాగతం

ప్రశాంతినిలయం శాంతిభవన్‌కు వచ్చిన ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావుకు ఎమ్మెల్యే పల్లెసింధూరారెడ్డి, మాజీమంత్రి పల్లె రఘునాథరెడ్డి పుష్పగుచ్ఛం అందచేసి స్వాగతం పలికారు. సత్యసాయి శతజయంతి ఉత్సవాల నేపథ్యంలో రవాణా సౌకర్యాలపై ఎండీతో చర్చించారు. సత్యసాయి సెంట్రల్‌ట్రస్టు మేనేజింగ్‌ట్రస్టీ ఆర్జే రత్నాకర్ పాల్గొన్నారు.

కుట్టుమిషన్ల కోసం మహిళల ధర్నా


ఎంపీడీఓకు వినతి పత్రం ఇస్తున్న నాయకులు, మహిళలు

ఓబుళదేవరచెరువు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): శిక్షణ పూర్తి చేసుకుని నాలుగు నెలలు గడుస్తున్నా కుట్టుమిషన్‌లు ఇవ్వకపోవడం పట్ల మహిళలు మంగళవారం ఎంపీడీఓ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. వీరికి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కదిరెప్ప, సీపీఐ మండల కార్యదర్శి చలపతినాయుడు మద్దతు పలికారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఏప్రిల్ నుంచి ఆగస్టు వరకు నిరుపేద మహిళలకు కుట్టుశిక్షణ ఇచ్చారన్నారు. నెలలు గడుస్తున్నా కుట్టుమిషన్‌లు, సర్టిఫికెట్లు ఇవ్వలేదని అన్నారు. అనంతరం వినతి పత్రాన్ని ఎంపీడీఓ శివరామ్‌రెడ్డికు అందజేశారు. కార్యక్రమంలో శిక్షణ ట్రైనీ సుహాసిని పాల్గొన్నారు.

బీజేపీని సంస్థాగతంగా బలోపేతం చేద్దాం

ధర్మవరంరూరల్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): బీజేపీని సంస్థాగతంగా బలోపేతం చేద్దామని ఆ పార్టీ జిల్లా ప్రధానకార్యదర్శులు అమర్‌దేవేంద్ర, సాకే ఓబిలేసు తెలిపారు. స్థానిక బీజేపీ కార్యాలయంలో మండల ప్రవాస్ యోజన కార్యక్రమాన్ని ఆ పార్టీ నాయకులతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మండలంలోని పోలింగ్‌బూత్‌కమిటీలు, శక్తి కేంద్రాలు, వివిధ మోర్చాల కమిటీలు త్వరగా పూర్తిచేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు చంద్ర, రాజు, భక్తవత్సలనాయుడు, లక్ష్మీనారాయణ, కొండయ్యచౌదరి, రాము, నందనాయక్, ధనుంజయ, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు సన్మానం


కబడ్డీ క్రీడాకారులను సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

ధర్మవరం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి 35వ సబ్ జూనియర్ కబడ్డీ పోటీలకు ధర్మవరం నుంచి ఎంపికైన క్రీడాకారులను బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హరీశ్‌బాబు స్థానిక ఎన్డీఏ కార్యాలయంలో మంగళవారం సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాష్ట్రస్థాయికి ఎంపిక కావడం గర్వకారణమన్నారు. కబడ్డీ క్రీడాకారులు నవ్య, సాజియా, హిమబిందు, శాంతి, మహమ్మద్ ఆసిఫ్, ఏసురాజు, నవదీప్, నూరుమహమ్మద్‌లను సన్మానించారు. కార్యక్రమంలో కబడ్డీకోచ్ పృథ్వీ, బీజేపీ నాయకులు రాజు, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

రోడ్డు పనుల పరిశీలన

ధర్మవరం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కదిరిగేటు నుంచి శ్మశాన వాటిక వరకు ఆర్అండ్‌బీ ఆధ్వర్యంలో రోడ్డు పనులు జరుగుతున్నాయి. ఈ పనులను బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హరీశ్‌బాబు మంగళవారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పట్టణ ప్రజలు చాలా కాలంగా ఎదురుచూస్తున్న రహదారి అభివృద్ధి పనులు వేగంగా ముందుకు సాగుతున్నాయన్నారు. త్వరలోనే ఫ్లైఓవర్ పనులు పూర్తయితే రవాణా వ్యవస్థ మరింత సులభతరం అవుతుందన్నారు.

ప్రజల ఆరోగ్యమే లక్ష్యం: మంత్రి


మోకాలి ఆపరేషన్ చేయించుకున్నవారితో డాక్టర్లు

ధర్మవరం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ప్రజల ఆరోగ్యమే ప్రధాన లక్ష్యమని రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గత నెల 25న ధర్మవరం ఎన్డీఏ కార్యాలయం నుంచి మోకాళ్లనొప్పులతో బాధపడుతున్న 25 మంది రోగులు, సంస్కృతి సేవాసమితి ఆధ్వర్యంలో బెంగళూరుకు పంపించామని తెలిపారు. 25 మందికి బెంగళూరులోని వైదేహి ఆసుపత్రిలో శస్త్రచికిత్సలు విజయవంతంగా చేశారని వివరించారు. మోకాళ్ల నొప్పులతో బాధపడుతున్న పేద, మధ్యతరగతి ప్రజలకు ఉచితంగా శస్త్రచికిత్సలు అందిస్తామని అన్నారు. శస్త్రచికిత్సల ఖర్చులు, వైద్యసేవలు, ఆసుపత్రిలో ఉన్నతమైన సదుపాయాలన్నీ ట్రస్టు ఆధ్వర్యంలో ఉచితంగా అందించామని తెలిపారు. భవిష్యత్తులో మరింతమందికి ఇలాంటి సేవా కార్యక్రమాలు అందించడానికి కృషిచేస్తామని మంత్రి పేర్కొన్నారు.

వసంతపురంలో సమస్యలను పరిష్కరించాలి

ధర్మవరంరూరల్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని వసంతపురం గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కారించాలని టీడీపీ నియోజకవర్గ క్లస్టర్ ఇన్‌చార్జ్ మహేష్‌చౌదరి అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. మంగళవారం ఆయన ఎంపీడీఓ సాయిమనోహర్, డిప్యూటీ ఎంపీడీఓ వెంకటేష్, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ వెంకటేష్‌తో కలిసి గ్రామంలో పర్యటించి సమస్యల పరిష్కారంకోసం చర్చించారు. కార్యక్రమంలో పంచాయతీ అధికారులు, టీడీపీ నాయకులు విజయసారథి, రమణ, పురుషోత్తం, నాగేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలి

ధర్మవరంరూరల్, నవంబరు4(ఆంధ్రజ్యోతి): వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలని ఆంధ్రప్రదేశ్ వాల్మీకి బోయసంఘం రాష్ట్ర యువజన అధ్యక్షుడు చింతకాయల నరేష్, జిల్లా అధ్యక్షుడు తలారి రమేష్ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక ప్రభుత్వాసుపత్రికి ఎదురుగా వాల్మీకి విగ్రహం వద్ద ధృడసంకల్పదీక్షకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈనెల 10న కర్నూలులో వాల్మీకి బోయలతో ధృడ సంకల్పదీక్ష చేపడుతున్నట్లు తెలిపారు.

పొలాలకు దారి సౌకర్యం ఏర్పాటు

తనకల్లు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని వడ్డుమరవపల్లి వద్ద వ్యవసాయ పొలాలకు వెళ్లడానికి దారి సౌకర్యం లేదు. ఈ విషయాన్ని గ్రామస్థులు పంచాయతీ కార్యదర్శి చంద్రనాయక్, సర్పంచ్ శైలజ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన సర్పంచ్ పంచాయతీ అధికారులతో కలిసి వడ్డుమరవపల్లిని సందర్శించారు. గ్రామస్థులు వ్యవసాయ పొలాలకు వెళ్లడానికి రహదారి సౌకర్యం లేక పడుతున్న ఇబ్బందులను గుర్తించారు. పంచాయతీ నిధులతో గ్రామం నుంచి పొలాల వరకు రహదారి నిర్మాణం ఏర్పాటు చేశారు.

వరిని తెగుళ్ల నుంచి కాపాడుకోవాలి

నంబులపూలకుంట, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): వరి పంటను తెగుళ్ల నుంచి కాపాడుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి లోకేశ్వర్ తెలిపారు. మంగళవారం వంకమద్ది గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వరిపంటకు కాండం తొలుచు పురుగు, కంకినల్లి, అగ్గితెగుళ్లు సోకాయని వివరించారు. వీటి నివారణకు రెండు గ్రాముల కార్టాప్‌హైడ్రో ఫ్లోరైడ్ ఒక లీటర్ నీటికి, లేదా కోసినోపాస్ రెండు ఎంఎల్‌ను ఒక లీటర్ నీటికి, ట్రైసైక్లోజోన్ ఒక గ్రాము లీటర్ నీటిలో కలిపి పిచికారి చేయాలన్నారు.

శాస్త్రీయ దృక్పథం పెంచుకోండి: ఎంఈఓ

జేవీవీ ఆధ్వర్యంలో పలుచోట్ల చెకుముకి టాలెంట్ టెస్ట్

ధర్మవరం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థి శాస్త్రీయ దృక్పథాన్ని అలవరచు కోవాలని ఎంఈఓ రాజేశ్వరి పేర్కొన్నారు. స్థానిక ఎన్జీఓ హోంలో మంగళవారం జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మండల స్థాయి సైన్స్ చెకుముకి టాలెంట్ టెస్టును నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓలతో పాటు జేవీవీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ ఆదిశేషు తదితరులు ప్రశ్నపత్రాలను విడుదలచేశారు. అనంతరం ఎంఈఓలు మాట్లాడుతూ...చెకుముకి సైన్ సంబరాల్లో పాల్గొనడంవల్ల ఆత్మవిశ్వాసం పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ-2 గోపాల్‌నాయక్, చిగిచెర్ల పాఠశాల హెచ్‌ఎం తిమ్మారెడ్డి, యూటీఎఫ్ నాయకులు రామకృష్ణనాయక్, జేవీవీ నాయకులు ఖలందర్ పాల్గొన్నారు. కాకతీయవిద్యానికేతన్ విద్యార్థులు అంజుమ్, జస్వంత్‌రెడ్డి, సాయిగౌరి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు.



ధర్మవరంలో ప్రశ్నపత్రాలు విడుదల చేస్తున్న ఎంఈఓలు, జేవీవీ నాయకులు

● కొత్తచెరువు : జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన వై.సంతోష్, పి.షణ్ముక కుమార్, జి.జస్వంత్ కుమార్‌రెడ్డి జిల్లా స్థాయి చెకుముకి పోటీలకు ఎంపికయ్యారని హెచ్‌ఎం.గోపాల్ తెలిపారు. మండల స్థాయిలో నిర్వహించిన చెకుముకి పోటీల్లో ప్రతిభ కనబరిచిచారని తెలిపారు.

● నంబులపూలకుంట: స్థానిక జడ్పీ ఉన్నతపాఠశాలలో మండల స్థాయి చెకుముకి టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. తుర్పునడింపల్లి పాఠశాల విద్యార్థులు శిరీషా, సోమేశ్వరీ, గణేష్ జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారని ఉపాధ్యాయులు శివయ్య, ముర్షీద్ తెలిపారు.

● ఓబుళదేవరచెరువు : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన జేవీవీ టాలెంట్ టెస్ట్‌లో ఎంఈఓ సురేష్‌బాబు, ప్రధానోపాధ్యాయురాలు శిరీష, జేవీవీ నాయకుడు గౌస్‌లాజమ్ పాల్గొన్నారు. మండల స్థాయిలో రెయిన్‌బో ఇంగ్లీష్ మీడియం పాఠశాలకు చెందిన విద్యార్థులు రత్నశేఖర్‌రెడ్డి, ఆయేషా, రోహిత్‌కుమార్‌రెడ్డి, జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన లక్ష్మీవరప్రసాద్, మానస, సింధుశ్రీ ఎంపికైనట్లు తెలిపారు. కార్యక్రమంలో హెడ్‌మాస్టర్ జయసింహారెడ్డి పాల్గొన్నారు.

అత్యాచార యత్నం కేసులో వైసీపీ నాయకుడి అరెస్ట్

నల్లచెరువు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువతిపై అదే గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు రామాంజనేయులు అత్యాచార యత్నానికి పాల్పడ్డంతో అరెస్టు చేసినట్లు ఎస్ఐ మగ్బూల్‌బాషా తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన వివరాలు వెల్లడించారు. యువతిపై అత్యాచారయత్నానికి పాల్పడిన రామాంజనేయులుపై 332-బి, 115-2 సెక్షన్‌ల కింద కేసులు నమోదు చేసినట్లు వివరించారు. నిందితుడు సోమవారం అదే గ్రామానికి చెందిన యువతి ఇంట్లోకి తల్లిదండ్రులు లేని సమయంలో చొరబడి కొట్టి అత్యాచార యత్నానికి పాల్పడ్డాడు. మద్యం మత్తులో ఉన్న నిందితుడు యువతి నోటిలో బట్టలు కుక్కి గట్టిగా కొట్టి బలాత్కారం చేయబోయాడు. యువతి కేకలు వేయడంతో పశువులదొడ్డిలో ఉన్న తండ్రి ఇంట్లోకి రావడం చూసిన నిందితుడు పరారయ్యాడు. గమనించిన చుట్టుపక్కల వారు ఆ వ్యక్తిని పట్టుకొని పోలీస్ స్టేషన్‌లో అప్పజెప్పారు. దీనిపై తల్లిదండ్రులు ఫిర్యాదుచేశారు. కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

గంజాయి మొక్కలు పెంచుతున్న వ్యక్తి..

పుట్టపర్తిరూరల్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): గంజాయి మొక్కలు పెంచి విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి రిమాండుకు తరలించినట్లు పుట్టపర్తి అర్బన్ సీఐ శివాంజనేయులు తెలిపారు. మహారాష్ట్రకు చెందిన వినోద్ కుమార్ పట్టణంలోని గోకులంలో 15 సంవత్సరాలుగా నివాసముంటున్నాడని వివరించారు. అతడి ఇంటి వెనుక పాడుపడిన స్థలంలో గంజాయి మొక్కలను పెంచి వాటిని విక్రయించడంతో పాటుగా తాను కూడా సేవించేవాడన్నారు. సోమవారం రాత్రి నిందితుడిని అరెస్టుచేసి మంగళవారం రిమాండుకు తరలించినట్లు సీఐ తెలిపారు.

బత్తలపల్లిలో ఏడుగురు జూదరులు..

బత్తలపల్లి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఈదులముస్టూరు గ్రామంలో సోమవారం అర్ధరాత్రి ఏడుగురు జూదరులను అరెస్టు చేసినట్లు ఎస్ఐ సోమశేఖర్ తెలిపారు. గ్రామంలో పేకాట ఆడుతున్నట్లు సమాచారం రావడంతో సిబ్బందితో వెళ్లి పేకాట స్థావరంపై దాడి చేశామని వివరించారు. ఏడుగురిని అరెస్టు చేసి వారి నుంచి రూ. 4070 స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

● గాండ్లపెంట: మండల పరిధిలోని కటారుపల్లి పంచాయతీ పరిసర ప్రాంతాలలో జూదం ఆడుతున్న ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ క్రాంతి కుమార్ మంగళవారం తెలిపారు. వారి వద్ద నుంచి రూ. 50,150 నగదున స్వాధీనం చేసుకున్నామని, కేసు నమోదు చేశామని వివరించారు.

భూ వివాదంలో ఘర్షణ : కేసు నమోదు

తనకల్లు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని రామ్లానాయక్ తండాకు చెందిన రమణనాయక్, సోదికమ్మకు గ్రామం ప్రభుత్వం ఐదు ఎకరాల భూమికి పట్టాలు మంజూరు చేసింది. వారు మంగళవారం పొలంలో వ్యవసాయం చేయడానికి వెళ్లారు. ఈ భూమిపై తమకు హక్కు ఉందని రమేష్‌నాయక్, తల్లిరాజమ్మ, భార్య, తమపై రాళ్లు, కట్టెలతో దాడి చేశారని రమణనాయక్, సోదికమ్మ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈవిషయంపై దర్యాప్తు చేసి, రమేష్‌నాయక్, తల్లి రాజమ్మ, భార్యపై కేసు నమోదుచేసినట్లు ఎస్ఐ గోపి తెలిపారు.

రోడ్డు ఆక్రమణలను పరిశీలించిన అధికారులు

తనకల్లు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన తనకల్లులో పోలీసుస్టేషన్ మీదుగా వివిధ గ్రామాలకు వెళ్లే రహదారిని కొందరు ఆక్రమించుకునే ప్రయత్నం చేస్తున్నారు. దీనిపై వంకపల్లికి చెందిన పలువురు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. స్పందించిన మండల స్థాయి అధికారులు మంగళవారం రహదారిని పరిశీలించారు. రహదారిలోకి వచ్చిన దుకాణదారులకు నోటీసులు జారీ చేయాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. దుకాణదారులందరూ తక్షణం రహదారి అక్రమణ నుంచి వెనక్కు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ షాబుద్దీన్, ఎంపీడీఓ రామానాయక్, ఎస్ఐ గోపి, పంచాయతీ కార్యదర్శి క్రిష్ణమూర్తిరెడ్డి పాల్గొన్నారు.

రైతులకు నోటీసులు



సర్వే చేస్తున్న అధికారులు

చిలమత్తూరు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): కొర్లకుంట ఎస్సీ కాలనీ శ్మశాన వాటికకు వెళ్లే దారి ఏర్పాటుపై అధికారులు చర్యలు ప్రారంభించారు. మంగళవారం డిటీ జగన్నాథంతోపాటు సర్వేయర్లు కలిసి శ్మశానానికి వెళ్లే రోడ్డుకు ఇరువైపులా భూమిని కలిగి ఉన్న రైతులను గుర్తించారు. రోడ్డు ఏర్పాటుకు ఎంత వరకు భూమి అవసరం..? తదితర విషయాలపై చర్చించారు. భూసేకరణ ప్రక్రియలో భాగంగా రైతులకు నోటీసులు జారీ చేసినట్లు డిటి జగన్నాథం తెలిపారు. నోటీసులు అందుకున్న రైతులతో నేడు తహసీల్దార్ కార్యాలయానికి హాజరవుతారని, వారి నుంచి భూసేకరణ విషయంపై అభిప్రాయాలు తీసుకొని ఉన్నతాధికారులకు పంపుతామన్నారు. ఇదిలా ఉండగా శ్మశాన వాటికకు రోడ్డు ఏర్పాటుచేసే వరకు తమ ఆందోళన ఆగేది లేదంటూ సీపీఐ నాయకులు వినోద్‌కుమార్, ఎస్సీ, ఎస్టీ ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు సాకే హరి, దళిత హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షులు రామక్రిష్ణయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి అంజన్న తదితరులు తహసీల్దార్ కార్యాలయం ముందు వంటావార్పు చేపట్టారు. ఎస్సీ కాలనీకి శ్మశాన వాటికకు రోడ్డు ఏర్పాటుచేసే వరకు తమ ఆందోళన ఆపేది లేదన్నారు.

యాదవుల అభివృద్ధికి పాటుపడాలి

కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ కేశవయ్య

పెనుకొండ టౌన్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): యాదవ కులస్థుల అభివృద్ధికి పాటుపడాలని ఆ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ కేశవయ్య సూచించారు. అనంతపురం జిల్లా యాదవసంఘం వర్కింగ్ అధ్యక్షుడు ప్రభాకర్‌యాదవ్‌ను మంగళవారం రాష్ట్ర డైరెక్టర్ కేశవయ్య తదితరులు పెనుకొండలో మంగళవారం సన్మానించారు. ఈ సందర్భంగా రాష్ట్ర డైరెక్టర్ మాట్లాడుతూ రాబోయే స్థానిక ఎన్నికల్లో జనాభా ప్రాతిపదికన సీట్లు కేటాయించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాసులు, సూర్యనారాయణ రెడ్డి, బాబుల్‌రెడ్డి, రమేష్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

దళితుల సమస్యలను పరిష్కరించండి

● మంత్రి డోలాకు వినతి

పెనుకొండ, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా దళితులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ బహుజన చైతన్యవేదిక సభ్యులు సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి, ఎస్సీ కమిషన్ చైర్మన్ జవహర్‌కు వినతిపత్రాన్ని అందించారు. మంగళవారం బహుజన చైతన్యవేదిక అధ్యక్షులు హైకోర్టు న్యాయవాది శివరామక్రిష్ణ, కమిటీ సభ్యులు వారిని కలిశారు. దళితులు శ్మశానవాటికలేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థులకు మౌలిక వసతుల కల్పనకు కృషి చేయాలని కోరారు. ఎస్సీ కార్పొరేషన్ రుణాల పునరుద్ధరణకు చొరవచూపాలన్నారు. కార్యక్రమంలో చైతన్యవేదిక రాష్ట్ర అధికార ప్రతినిధి ఆనంద్, వర్కింగ్ ప్రెసిడెంట్ నాగార్జున, రాయలసీమ అధ్యక్షుడు గోళ్లాపురం అంజి పాల్గొన్నారు.

రోడ్డుపై మొక్కజొన్న రాసులతో ప్రమాదాలు

చిలమత్తూరు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): రోడ్డుపై రైతులు మొక్కజొన్నలు ఆరబెట్టుకోవడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ఎస్ఐ మునీర్ అహమ్మద్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన కనుమ ప్రాంతంలో 544-ఇ జాతీయ రహదారిలో మొక్కజొన్నలు ఆరుబోసుకున్న రైతులకు ప్రమాదాలపై హెచ్చరికలు జారీ చేశారు. రాత్రి సమయంలో వాహనాలు నడిపే వారికి మొక్కజొన్న రాసులు సరిగా కనపడవని, దాంతో ప్రమాదాలు చోటుచేసుకునే అవకాశం ఉందన్నారు. ప్రమాదాలు జరగకుండా రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని, లేని పక్షంలో ప్రమాదాలకు బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు.

నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

పల్లెనిద్రలో సీఐ జనార్దన్

చిలమత్తూరు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): నేరాలపై ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని హిందూపురం రూరల్ సీఐ జనార్దన్ పేర్కొన్నారు. వడ్డిచెన్నంపల్లి గ్రామంలో ఆయన ఎస్ఐ మునీర్ అహమ్మద్‌తో కలిసి పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహించారు. గ్రామస్థులతో సమావేశం నిర్వహించి వారికి నేరాల అప్రమత్తతపై అవగాహన కల్పించారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, అసాంఘిక కార్యకలాపాలను ఎట్టి పరిస్థితుల్లోను ప్రోత్సహించరాదన్నారు. రోడ్డు భద్రతపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలన్నారు. వాహనాలు నడిపే సమయంలో నిబంధనలు పాటించాలన్నారు. ఏదైనా సమస్య ఉన్నప్పుడు నేరుగా స్టేషన్‌కి వచ్చి చెప్పుకోవచ్చన్నారు.

ట్యాంక్ నిర్మాణానికి భూమిపూజ

రొద్దం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): రొప్పాల గ్రామంలో ఓవర్‌హెడ్ ట్యాంక్ నిర్మాణానికి రూ.30లక్షల నిధులతో టీడీపీ నాయకులు భూమిపూజ చేశారు. రాష్ట్ర బీసీ సంక్షేమ చేనేత జౌళిశాఖ మంత్రి సవిత నిధులను మంజూరుచేయడంతో మంగళవారం పనులు ప్రారంభమయ్యాయి. కార్యక్రమంలో కాంట్రాక్టర్ కౌశిక్, నరహరి, రాము, శంకర్, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

రహదారి సమస్య పరిష్కారం

గోరంట్ల, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని బూదిలివాండ్లపల్లి రహదారి సమస్యను అధికారులు మంగళవారం పరిష్కరించారు. తహసీల్దార్ మారుతి, సీఐ శేఖర్ సిబ్బందితో గ్రామానికెళ్లి చర్చించి సమస్య పరిష్కారం అయ్యేలా చేశారు. సర్పంచ్ సువర్ణ అశ్వత్థరెడ్డి ఆధ్వర్యంలో ట్రిప్పర్లతో మట్టిని తరలించి రహదారి పనులు చేపట్టారు.

ఆర్టీసీ బస్టాండు వినియోగంలోకి వచ్చేనా..?

పాతికేళ్లుగా అధికారుల నిర్లక్ష్యం



వృథాగా ఉన్న ఆర్టీసీ బస్టాండు

సోమందేపల్లి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో 25 ఏళ్ల క్రితం నిర్మించిన ఆర్టీసీ బస్టాండు సేవలు వినియోగంలోకి వచ్చేనా..? అంటూ స్థానికులు ప్రశ్నిస్తున్నారు. బస్టాండు సేవలు ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడంలో అధికారులు విఫలమవుతున్నారని విమర్శిస్తున్నారరు. కొన్నిరోజుల క్రితం ఆర్టీసీ బస్సులు బస్టాండులోకి వచ్చిపోయేలా అధికారులు చర్యలు తీసుకున్నారు. మొదట పరిసరాల్లో ఉన్న పిచ్చిమొక్కలు తొలగించి నేమ్‌బోర్డును రాయించారు. కంట్రోలర్‌ను నియమించి బస్టాండులో ఉన్న రెండు దుకాణాలకు టెండర్లు సైతం ఆహ్వానించారు. అయితే ఏమైందో ఏమో తెలియదుకానీ మళ్లీ బస్టాండు సేవలు ప్రజలకు అందుబాటులోలేకుండా పోయాయి. ఆర్టీసీ బస్టాండు నిరుపయోగంగా మారింది. పట్టణానికి దూరంగా నిర్మించినందుకు ప్రజలు వినియోగించుకోలేకపోతున్నారని చెబుతున్నా ప్రస్తుతం జనాభా పెరిగి బస్టాండు పరిసర ప్రాంతాల్లో స్కూళ్లు, గృహాలు, వాణిజ్య సముదాయాలు పెరిగాయి. అన్ని అనుకూలంగా ఉన్నా బస్టాండు వినియోగంలోకి తీసుకురావడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. పట్టణంలో పెద్దమ్మ ఆలయం వద్ద ఆర్టీసీ, ప్రైవేట్ బస్సులు ఆపుతుండటంతో ప్రజలు అక్కడి నుంచి ప్రయాణించడానికి అలవాటుపడ్డారు. ట్రాఫిక్ సమస్య అధికమైనా ఆ ప్రదేశం నుంచి ప్రయాణం కొనసాగిస్తున్నారు. అయితే ప్రభుత్వం స్త్రీశక్తి పథకం అమలు చేస్తుండటంతో ఆర్టీసీ బస్సులో మహిళలు అధికంగా ప్రయాణిస్తున్నారు. ఆర్టీసీ బస్టాండు సేవలు పునరుద్ధరిస్తే ఎంతో ప్రయోజనంగా ఉంటుందని మహిళలు అంటున్నారు. దీనిపై ఆర్టీసీ ఇన్‌చార్జి డీఎం రంగభాశ్యంను వివరణ కోరగా త్వరలో బస్టాండు సేవలను పునరుద్ధరిస్తామన్నారు. ప్రతి ఆర్టీసీ బస్సు బస్టాండు ద్వారా వెళ్లేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

నేడు లక్ష దీపారాధన



పురవీధుల్లో ఊరేగుతున్న కాశీవిశ్వేశ్వరుడు

పెనుకొండ, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని స్థానిక కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో బుధవారం 45వ లక్ష దీపారాధన మహోత్సవం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉదయం స్వామివారికి భస్మహారతి, సామూహికంగా మహన్యాసపూర్వక అభిషేకాలు, సాయంత్రం 6గంటల నుంచి లక్ష దీపారాధన కార్యక్రమం ఉంటుందన్నారు. రాత్రి ఘనగిరి కొండపై సామూహిక అఖండ జ్యోతి కార్యక్రమం, అనంతరం ఆలయంవద్ద గిరిజాకళ్యాణం నిర్వహించడం జరుగుతుందన్నారు. భక్తులు పెద్దఎత్తున హాజరై దీపారాధన కార్యక్రమంలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని నిర్వాహకులు కోరారు. కాగా మంగళవారం ఆలయంలో ఉదయం గోపూజ, రతాంగ హోమం, మధ్యాహ్నం మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. సాయంత్రం 6నుంచి స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని రథంపై ఉంచి పురవీధుల్లో గ్రామోత్సవాన్ని నిర్వహించారు.

'నాణ్యమైన భోజనం అందించండి'

లేపాక్షి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన నాణ్యత లోపించిందని సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ఏఐఎస్‌బి జిల్లా అధ్యక్షులు చంద్రశేఖర్‌రెడ్డి కోరారు. మంగళవారం ఎంఈఓ నాగరాజునాయక్‌కు ఈ మేరకు వినతిపత్రం అందించారు. మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లోనూ ఉడికీ ఉడకని అన్నం నీళ్లచారు వడ్డిస్తున్నారన్నారు. దీంతో విద్యార్థులు ఇళ్ల నుంచి లంచ్‌బాక్స్‌లు తీసుకొస్తున్నారని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే సంబంధిత అధికారులు పాఠశాలలను సందర్శించి భోజన నాణ్యతను పరిశీలించి విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. లేనిపక్షంలో నిరసన వ్యక్తం చేస్తామన్నారు.

నేడు చాకర్లపల్లి రైల్వేగేటు మూసివేత

సోమందేపల్లి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని హిందూపురం రోడ్డులో చాకర్లపల్లి రైల్వేగేటువద్ద బుధవారం రైల్వేట్రాక్ మరమ్మతుల నిమిత్తం ఉదయం 10నుంచి సాయంత్రం 6 వరకు గేటు మూసివేస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. ప్రయాణికులు హైవే ద్వారా ప్రయాణించాలని సూచించారు.

జూదరుల అరెస్ట్

రొద్దం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): నల్లూరు గ్రామ శివారులో పేకాట ఆడుతున్న ఎనిమిది మందిని అరెస్ట్‌చేసి రూ.5వేలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ వీరాంజనేయులు తెలిపారు. కేసు నమోదుచేసినట్లు ఎస్ఐ తెలిపారు.

అభివృద్ధి పనుల పరిశీలన

పరిగి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తంగా గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులను డీఎల్‌డీఓ రామక్రిష్ణ మంగళవారం పరిశీలించారు. అనంతరం పంచాయతీ కార్యదర్శులతో సమావేశమై అపరిశుభ్రతపై ఎప్పటికప్పుడు కార్యదర్శులు చర్యలు తీసుకోవాలన్నారు. మంచినీటి సమస్య తలెత్తకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రెడ్డప్ప, డిప్యూటీ ఎంపీడీఓ విజయభాస్కర్‌రెడ్డి, మండల ఏఈ నాగన్న, పంచాయతీ కార్యదర్శులు ఆనంద్, వెంకటేశ్ పాల్గొన్నారు.

'విధులు సమర్థవంతంగా నిర్వహించాలి'

సోమందేపల్లి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): విధులను సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా వ్యాధినిరోధక టీకాల అధికారి సురేష్‌బాబు సూచించారు. మండలంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో మంగళవారం ఆశ డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యశాఖ నుంచి అమలవుతున్న ప్రతి కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. అనంతరం సిబ్బంది సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా సూపరింటెండెంట్ ఫైరోజ్‌ఖాన్, సామాజిక ఆరోగ్యఅధికారి వన్నప్ప, వైద్యులు ఓంకార్, సీనియర్ అసిస్టెంట్ మధు పాల్గొన్నారు.

కార్యకర్తలను ఆదుకుంటాం: టీడీపీ

చిలమత్తూరు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): కష్టాల్లో ఉన్న ప్రతి కార్యకర్తను ఆదుకునే ప్రయత్నం చేస్తామని టీడీపీ నాయకులు పేర్కొన్నారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రగాయాలై చికిత్స పొందుతున్న చిలమత్తూరుకి చెందిన టీడీపీ కార్యకర్త ముత్యాలప్ప కుటుంబానికి మంగళవారం టీడీపీ నాయకులు లక్ష్మీనారాయణయాదవ్ తదితరులు పరామర్శించారు. బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందించారు. పార్టీ కోసం కష్టపడే వారికి పార్టీ ఎప్పటికీ మరవదన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు విశ్వనాథ రెడ్డి, శివ, చంద్రారెడ్డి తదితరులు ఉన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థిని



గాయత్రి

పెనుకొండ రూరల్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన గాయత్రి రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం నాగపద్మజ, పీడీ దివాకర్ తెలిపారు. మంగళవారం అనంతపురంలోని ఆర్ట్స్ కళాశాల క్రీడా మైదానంలో నిర్వహించిన అండర్-14 త్రోబాల్ పోటీల్లో మొదటి స్థానంలో నిలిచింది.

కేజీబీవీ తనిఖీ

రొళ్ల, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని కేజీబీవీ పాఠశాలను ఎంఈఓ శ్రీధర్ తనిఖీచేశారు. మంగళవారం ఆయన విద్యార్థులకు జరుగుతున్న విజయపథకం టెస్ట్‌ల గ్రేడింగ్, మనబడి కార్యక్రమం మిగులు స్టాక్‌లను తనిఖీచేశారు. విద్యార్థులు ఇప్పటి నుంచే కష్టపడి చదివితే మంచి మార్కులు సాధించవచ్చని సూచించారు.

సోషల్ మీడియా చురుగ్గా పనిచేయాలి

● టీడీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు
● ఐ-టీడీపీ వింగ్ పట్టణ కమిటీ ఏర్పాటు



ఐటీడీపీ పట్టణ కమిటీతో కోఆర్డినేటర్ శ్రీనివాసరావు

హిందూపురం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ అనుబంధంగా ఉన్న ఐటీడీపీ సోషల్ మీడియా చురుగ్గా పనిచేయాలని నియోజకవర్గ టీడీపీ కోఆర్డినేటర్ పావలూరి శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ కార్యాలయం వద్ద ఐటీడీపీ వింగ్ పట్టణ కమిటీని ప్రకటించారు. ఈ సందర్భంగా వారితో శ్రీనివాసరావు సమీక్ష చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టే ప్రతి కార్యక్రమాన్ని జనంలోకి తీసుకెళ్లే బాధ్యత ఐటీడీపీ వింగ్ తీసుకోవాలన్నారు. హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ అధికంగా నిధులు తీసుకొస్తున్నారని అందుకు తగ్గట్టుగా సోషల్ మీడియాలో మీరు తెలియజేయలేకపోతున్నారన్నారు. తెలుగుదేశం పార్టీ నాయకులతో సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళ్లాలన్నారు. పార్టీ ఎప్పుడూ మీ వెంటే ఉంటుందని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షులు వెంకటేశ్, ఐటీడీపీ జిల్లా అధ్యక్షుడు రామాంజినేయులు, ఐటీడీపీ వింగ్ ప్రతినిధులు శ్రీనివాస్‌నాయుడు, నజీర్, అనీల్, ఐటీడీపీ వింగ్ సభ్యులు పాల్గొన్నారు.

తండ్రి బాటలో తనయులు

రాజకీయంగా ఒకరు.. ఆధ్యాత్మికంగా మరొకరు..



సుదేశ్‌కుమార్



అనిల్‌కుమార్

పావగడ, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): తండ్రి ఆశయ సాధనకోసం తనయులు కృషి చేస్తున్నారు. ఆధ్యాత్మికంగా ఒకరు, రాజకీయంగా మరొకరు పాటుపడుతున్నారు. దివంగత జీఎస్ ధరంపాల్ తనయులు అనిల్‌కుమార్, ఎస్ఎస్‌కె సంఘం అధ్యక్షుడు సుదేష్‌కుమార్ పట్టణ అభివృద్ధిలో తమవంతు పాత్ర పోషిస్తున్నారు. దివంగత జీఎస్ ధర్మపాల్ పారిశ్రామికవేత్తగా, కాంగ్రెస్ నాయకుడిగా 1998 నుంచి 2020 వరకు ఎస్ఎస్‌కె సంఘం అధ్యక్షుడిగా ఉంటూ పట్టణాభివృద్ధికి కృషి చేశారు. మున్సిపల్ అధ్యక్షుడిగా కూడా బాధ్యతలు చేపట్టి మంచి పేరు తెచ్చుకున్నారు. ఆయన కుమారులు అనీల్‌కుమార్ ఎస్ఎస్‌కె అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి ఆలయ అభివృద్ధికి కృషిచేస్తున్నారు. ఆయన బాధ్యతలు చేపట్టిన తరువాత శనైశ్చర ఆలయం స్వర్ణదేవాలయంగా మార్చడానికి, నిత్య అన్నదానం కార్యక్రమాన్ని చేపట్టడం జరిగింది. ఇక సుదేశ్‌కుమార్ బ్లాక్ కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడిగా ఉంటూ తాగునీటి సమస్యను తీర్చారు. పట్టణ పరిశుభ్రత కోసం ఆరు నెలల వ్యవధిలోనే కృషిచేశారు. అదేవిధంగా ధర్మపాల్ తమ్ముడు ప్రసన్నకుమార్ తనయుడు ప్రమోద్‌కుమార్ కూడా పెదనాన్న, అన్నల అడుగుజాడల్లో ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారు.

15 గొర్రెల అపహరణ

రొద్దం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): చెరుకూరు గ్రామానికి చెందిన కురుబ హనుమంతరాయుడుకు చెందిన 15 గొర్రెలను గుర్తుతెలియని వ్యక్తులు అపహరించుకెళ్లారు. హనుమంతరాయుడు గంగమ్మ దేవాలయం వద్ద పూజలకోసం వెళ్లి రాత్రి తిరిగి రావడంతో గొర్రెల పాక వాకిలి తెరిచి ఉంది. వెళ్లిచూడగా 15 గొర్రెలు కనిపించలేదు. ఈ విషయంపై ఎస్ఐ వీరాంజనేయులుకు మంగళవారం ఫిర్యాదు చేశారు.

సీఏలో సత్తాచాటిన యువకుడు



రంజిత్‌రెడ్డి

హిందూపురం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): గ్రూప్-1 సీఏ ఫలితాల్లో హిందూపురం మండలం నక్కలపల్లికి చెందిన రంజిత్‌రెడ్డి చక్కటి ప్రతిభ కనబరిచారు. సోమవారం దేశ వ్యాప్తంగా విడుదలైన సీఏ గ్రూప్-1 ఫలితాల్లో తొలి ప్రయత్నంలోనే 164మార్కులు సాధించి ఉత్తీర్ణుడయ్యాడు. గత ఏడాది మేలో జరిగిన గ్రూప్-2 పరీక్షల్లో కూడా మొదటి ప్రయత్నంలోనే ఉత్తీర్ణత సాధించాడు. సీఏలో ఉత్తీర్ణత సాధించడం పట్ల కుటుంబ సభ్యులు, స్నేహితులు హర్షం వ్యక్తం చేశారు.

ఎట్టకేలకు మురుగు నీటి తొలగింపు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

పెనుకొండ రూరల్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): నగర పంచాయతీ కోనాపురం ఎస్సీ కాలనీలో వెంకప్ప ఇంటి చుట్టూ మురుగునీటిని తొలగించారు. ఈనెల 1న ఆంధ్రజ్యోతిలో ఇంటిచుట్టూ మురుగునీరు అన్న కథనానికి అధికారులు స్పందించారు. మంగళవారం నగర పంచాయతీ అధికారులు, సచివాలయ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని పారిశుధ్య కార్మికులతో మురుగును శుభ్రం చేయించి ఇంటి చుట్టూ బ్లీచింగ్ చల్లారు.

'పుస్తకాలకు పరిమితం కావద్దు'

హిందూపురం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు పుస్తకాలకే పరిమితం కాకుండా సాంస్కృతిక క్రీడాకార్యక్రమాలకు కొంత సమయాన్ని వెచ్చించాలని ఆల్ ఇండియా రేడియో ట్రాన్స్‌స్ట్ ఎగ్జిక్యూటివ్ హారిక అన్నారు. మంగళవారం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఫ్రెషర్స్‌డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన హారిక మాట్లాడుతూ చదువుతోపాటు విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీయడానికి సాంస్కృతిక కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రగతి, వైస్ ప్రిన్సిపాల్ వెంకటేశులు, లక్ష్మీ, సీనియర్ అసిస్టెంట్ నర్సింహులు పాల్గొన్నారు.

గ్రామ కమిటీలపై బీజేపీ సమీక్ష

సోమందేపల్లి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): గ్రామ కమిటీలపై మంగళవారం బీజేపీ కార్యాలయంలో నాయకులు సమీక్ష నిర్వహించారు. గ్రామ, బూత్ కమిటీలను ఏర్పాటుచేసేందుకు కృషిచేయాలని బీజేపీ నాయకులు ప్రభాస్, రామక్రిష్ణ సూచించారు. ప్రతి గ్రామంలోనూ బీజేపీ జెండా ఎగిరేలా కార్యకర్తలు, నాయకులు పనిచేయాలన్నారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి స్వదేశీ స్టిక్కర్లను గృహాలకు అంటించి కరపత్రాలను పంచారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు మంజునాథ్, నాయకులు సోమశేఖర్, నిమ్మకాయల ప్రసాద్, బాలగోపాల్, అంజినప్ప, లక్ష్మీనారాయణ, బాలాజీ, గిరీ, సురేష్, పూజారి హరి, లోకేష్, వెంకటేశ్, నరేష్ పాల్గొన్నారు.

బీమాతో కుటుంబానికి రక్షణ: సీఈఓ

రొద్దం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): బీమా కుటుంబానికి రక్షణ అని అనంతపురం జిల్లా సహకార బ్యాంక్ సీఈఓ సురేఖరాణి అన్నారు. మంగళవారం రొద్దంలో సింగిల్‌విండో సొసైటీలో కేంద్ర ప్రభుత్వం అందించే పీఎంఎస్‌బీవై, పీఎంజేజేబీవై బీమాలతో కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించుకోవాలని అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సురేఖరాణి హాజరై మాట్లాడారు. సింగిల్‌విండో సొసైటీల ద్వారా ప్రజలు రుణాలు పొంది తిరిగి చెల్లిస్తే సొసైటీలు అభివృద్ధి చెందుతాయన్నారు. కార్యక్రమంలో నాబార్డ్ డీడీఎం అనురాధ, హిందూపురం డివిజనల్ కోఆపరేటివ్ ఆఫీసర్ ఆదినారాయణ, పెనుకొండ అధికారి రమణారెడ్డి, బ్రాంచ్ మేనేజర్ నాగభూషణం, సూపర్‌వైజర్ రంగలక్ష్మమ్మ, సీఈఓ వెంకటేశ్, రొద్దం సింగిల్‌విండో అధ్యక్షులు వీరాంజనేయులు పాల్గొన్నారు.

ఉరివేసుకుని వ్యక్తి ఆత్మహత్య

రొద్దం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): తురకలాపట్నం గ్రామానికి చెందిన ఉప్పర అంజినప్ప(55) చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ వీరాంజనేయులు తెలిపారు. ఉప్పర అంజినప్ప తన కుమారుడికి ఉద్యోగం రానందున మనస్థాపంతో సోమవారం రాత్రి గ్రామ సమీపంలోని చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. వెంటనే బంధువులు తెలుసుకుని పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందాడు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వీరాంజనేయులు తెలిపారు.